రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



# ఉచితాలకు తూచ్..

- పెట్రోలు బంకుల్లో వసతులు కరువు
- కనీస సౌకర్యాలు కల్పించని యాజమాన్యాలు
- అధికారుల పర్యవేక్షణ శూన్యం
- అవగాహనారాహిత్యంతో నోరుమెదపని వినియోగదారులు





నిరుపయోగంగా ఉన్న గాలి మిషన్

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** పెట్రోలు బంకుల్లో వసతుల కల్పనపై యాజమాన్యాలు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శి స్తున్నాయి. వినియోగ దారులకు ఉచితంగా పలు సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత వారిపై ఉన్నా అధికారుల పర్యవేక్షణ లేక 80 శాతం బంకుల్లో సేవలు కరువైనాయి. ప్రభుత్వ నిబం ధనలేమో కాగితపు పులులుగా మిగిలి పోతు న్నాయి. నిబంధనలను అమలు పరచాల్సిన అధికారులు గాఢ నిద్రలో ఉన్నారని విమర్శలు వస్తు న్నాయి. దాంతో పాటు చాలామంది వినియోగదారులకు దీనిపై అవగాహన లేకపోవడం బంక్‌ల యాజమాన్యాలకు కలిసొచ్చే అంశంగా మారింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెట్రోలు బంకుల్లో పలు ఉచిత సేవలను కల్పించాలి. సంబంధిత బంకుల్లో ఇంధనం కొనుగోలు చేసినా, చేయకున్నా సౌకర్యాలను ఉపయోగించుకునే హక్కు వినియోగదారులకు ఉంది.

**టైర్లలో ఉచిత గాలి**

ప్రతి పెట్రోలు బంకుల్లో ఉచితంగా గాలి నింపే పాయింట్ ఏర్పాటు చేయాలి. వినియోగదారుడు కోరిన వెంటనే వాహనాల టైర్లలో ఉచితంగా గాలి నింపాలి. గాలి ప్రెజర్ కూడా చెక్ చేయాలి. చాలా బంకుల్లో గాలి నింపే యంత్రాలు కనిపించడం లేదు. పలుచోట్ల తుప్పు పట్టి వృథాగా పడివున్నాయి. కొన్ని చోట్ల మిషన్ పని చేయడం లేద్సార్.. అంటూ సిబ్బంది సమాధానం ఇస్తున్నారు. వర్కర్లు లేరంటూ కూడా దాటవేత ధోరణి ప్రదర్శి స్తు న్నారు. వికారాబాద్ జిల్లాలో ఉన్న బంకుల్లో 10 శాతం మాత్రమే గాలి నింపే యంత్రాలు పనిచేస్తున్నాయి.

**ప్రథమ చికిత్స**

ప్రతి బంకుల్లో ప్రథమ చికిత్స బాక్సులు అమర్చాలి. అత్యావసర పరిస్థితుల్లో బాక్సుల్లో ఉన్న మందులను, కిట్లను ఉపయోగించాలి. కాలం తీరిన మందులను తొలగించి కొత్త వాటిని అందుబాటులో ఏర్పాటు చేయాలి. జిల్లాలో 95 శాతం బంకుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లు కనిపించిన దాఖలాల్లేవు. దీనిపై చాలామంది వినియోగ దారులకు అవగాహన లేదు. అంతెందుకు విద్యావంతులకూ సరైన అవగాహన లేకపోవడం గమనార్హం. పౌర సరఫరాల శాఖ అధికారులు కూడా ఏనాడూ వీటిపై అవగాహన కల్పించలేదు.

**ఉచితంగా ఫోన్ సౌకర్యం**

ప్రతి బంకులో వినియోగదారులకు అత్యవసర పరిస్థితుల్లో ఉచితంగా ఫోన్ కాల్ చేసుకునే హక్కు ఉంది. అక్కడ ఉన్న సిబ్బంది ఫోన్ ద్వారా కాల్స్ చేసుకోవచ్చని నిబంధనలు ఉన్నాయి.

**మరుగుదొడ్లు, మంచినీరు**

పలు పట్టణాల్లో గల పెట్రోలు బంకుల్లో మరుగు దొడ్లను ఉపయోగించేందుకు అనుమ తించడం లేదు. ఇది నిబంధనలకు విరుద్ధం. కానీ జనం ప్రశ్నించలేని పరిస్థితి. ప్రతి బంకుల్లో మరుగుదొడ్లు, మంచినీటి వసతులు కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యాలదే. దీనిపై వినియోగ దారులకు అవగాహన కలిగి నపుడే యాజమాన్యాలు దిగివస్తాయి. పెట్రోలు బంకుల్లో లభిస్తున్న సేవలు, ఇంధన నాణ్య తపై ప్రతి వినియోగదారుడు ఫిర్యాదులు చేసుకునే అధికారం ఉంది. పెట్రోలు బంక్‌ల వద్ద ఏర్పాటు చేసిన ఫిర్యాదుల రిజిష్టర్‌లో నమోదు చేయాలి. కానీ జిల్లాలో ఎక్కడా ఇలాంటివి కనిపించడం లేదు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల పరిస్థితి ఇలా దాపురించిందని విమర్శలు వస్తున్నాయి. పలుచోట్ల తూకాలలో మోసాలు, నాణ్యతపై వినియోగ దారులు ఆందోళన చేపట్టిన సంఘటనలు ఉన్నాయి.



# బంగారానికి బేడీలు

## అన్నదాతల రుణాలలో సహకార బ్యాంకుల దందా

✦అత్యవసర గోల్డ్ లోన్లపై 2.5 వసూలు ✦లోన్‌కు ముందే షేర్ పేరిట కోతలు ✦క్రాప్ లోన్లకూ వాటా ✦పూర్తి రుణం చేతికివ్వాలని రైతుల డిమాండ్ ✦లేదంటే డిపాజిట్లకు వడ్డీ చెల్లించాలని విజ్ఞప్తి

**పెట్టుబడి కోసం పైసా అప్పు పుట్టని సాగు సీజన్‌లో, చేతిలో ఉన్న బంగారాన్ని నమ్ముకుని సహకార బ్యాంకులకు వస్తున్న రైతులను బ్యాంకర్లు నిలువునా ముంచుతున్నారు. తక్కువ వడ్డీకే లోన్ ఇస్తారని ఆశపడితే.. అసలు అప్పు చేతికి రాకముందే 2.5 శాతం షేర్ అమోంట్ పేరిట ముక్కుపిండి వసూలు చేస్తూ అన్నదాతల జేబులకు చిల్లులు పెడుతున్నారు. క్రాప్ లోన్లకు వాటా ధనం తీసుకుంటే అర్థముంది కానీ, అత్యవసర గోల్డ్ లోన్లపై కూడా ఈ బలవంతపు వసూళ్లేంటని వికారాబాద్ జిల్లా రైతులు ప్రశ్నిస్తున్నారు. పైగా తాము దాచుకున్న ఆ షేర్ డిపాజిట్లకు రూపాయి వడ్డీ కూడా ఇవ్వకపోవడం ఏ రకమైన సహకారమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.**

**వికారాబాద్, ప్రభాతవార్త:** గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు, ముఖ్యంగా వ్యవసాయ రంగానికి సహకార బ్యాంకులు వెన్నెముక లాంటివి. ప్రైవేటు వడ్డీ వ్యాపారుల కోరల్లో చిక్కుకుని నలిగిపోయే రైతులకు తక్కువ వడ్డీకే రుణాలు అందించి, వారిని ఆర్థికంగా నిలబెట్టడమే లక్ష్యంగా ఈ బ్యాంకులు ఏర్పాటయ్యాయి. అందుకే రైతాంగం కూడా సహకార బ్యాంకులు అంటే తమ సొంత బ్యాంకులుగా భావిస్తుంది. కానీ వాస్తవంలోకి వస్తే పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉంది. నేడు ఈ బ్యాంకులు అన్నదాతలను ఆదుకోవాల్సింది పోయి, వారి జేబులకు నిలువునా చిల్లులు పెడుతున్నాయి. ఖాతాదారులలో అత్యధిక శాతం అమాయక, నిరక్షరాస్యులైన రైతులు కావడమే శాపంగా మారింది. వారి అమాయకత్వాన్ని అవకాశంగా మార్చుకుంటున్న సహకార బ్యాంకుల నిర్వాహకులు.. లేనిపోని నిబంధనలు సృష్టిస్తూ, రకరకాల కొర్రీలు పెడుతూ అన్నదాతలైన ఖాతాదారులకు పెద్ద ఎత్తున టోకరా వేస్తున్నారు.

సహకార బ్యాంకులలో వ్యాపార నిబంధనల ప్రకారం క్రాప్ లోన్ (పంట రుణాలు) లేదా దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలు తీసుకున్న వారి వద్ద నుంచి షేర్ అమోంట్ (వాటా ధనం) డిపాజిట్ రూపంలో తీసుకుంటే ఒక పద్ధతి, దానికి ఒక అర్థం ఉండేది. ఎందుకంటే వారు బ్యాంకు సభ్యులుగా కొనసాగుతారు కాబట్టి. కానీ వికారాబాద్ పరిధిలోని సహకార బ్యాంకులు మాత్రం మానవత్వాన్ని, కనీస నియమాలను పక్కన బెట్టేశాయి.

అత్యవసరాల కోసం రైతులు తెచ్చుకునే బంగారు రుణాలపై కూడా షేర్ అమోంట్లు డిపాజిట్ చేసుకోవడం ఇక్కడి ఘోరమైన పరిస్థితికి అద్దం పడుతోంది.

**ప్రైవేటు ఫైనాన్స్‌ల వద్ద చక్రవడ్డీల భయం**

ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ సాగు సీజన్ ముమ్మరంగా నడుస్తోంది. విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చుల కోసం రైతులకు చేతిలో పైసా లేని పరిస్థితి ఏర్పడింది. మార్కెట్‌లో ఎక్కడా కూడా రైతులకు పైసా అప్పు పుట్టడం లేదు. ఇటువంటి గడ్డు కాలంలో వ్యవసాయ పెట్టుబడి కోసం రైతులు ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి రుణాలు పొందేందుకు సహకార బ్యాంకులకు పరుగులు తీస్తున్నారు. బయట ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల్లో లేదా వడ్డీ వ్యాపారుల వద్దకు వెళితే చక్రవడ్డీలతో సర్వస్వం ఊడుస్తుందని, సహకార బ్యాంకుల్లో అయితే తక్కువ వడ్డీకే రుణం లభిస్తుందని నమ్మి రైతులు ఇక్కడికి వస్తున్నారు.

**షేర్ అమౌంట్ డిపాజిట్‌కు సొసైటీల వత్తిడి**

అయితే, గత రెండు నెలలుగా సహకార బ్యాంకుల్లో ఒక కొత్త దందా మొదలైంది. బంగారు రుణాలపై ఖచ్చితంగా 2.5 శాతం షేర్ అమోంట్ డిపాజిట్ చేయాల్సిందేనని బ్యాంకు నిర్వాహకులు కఠినమైన నిబంధన పెట్టారు. వచ్చే పేద రైతుల వద్ద నుంచి ఈ మొత్తాన్ని ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఒకవేళ ఈ 2.5 శాతం షేర్ అమౌంట్ కట్టడానికి నిరాకరిస్తే, "మీకు బంగారు రుణాలు ఇచ్చే ప్రసక్తే లేదు" అంటూ బ్యాంకు అధికారులు రైతుల ముఖం మీదే తెగేసి చెబుతున్నారు.

**వేరే దిక్కులేక తల వంచుతున్న రైతులు**

వేరే బ్యాంకులకు వెళితే వడ్డీ భారం మోయలేమని తెలిసి, చేసేదేమీ లేక, దిక్కుతోచని స్థితిలో రైతులు సహకార బ్యాంకుల్లోనే బంగారు రుణాలు పొందుతున్నారు.

కంటి ముందే తాము తెచ్చిన బంగారానికి వచ్చే లోన్ డబ్బుల నుంచి, ఈ షేర్ అమోంట్ డిపాజిట్ పేరుతో పెద్ద మొత్తంలో డబ్బులు కట్ చేసుకుంటుండటంతో అన్నదాతలు లబోదిబోమంటూ కన్నీరు మున్నీరవుతున్నారు.

**పేపర్ చార్జీలు, జీఎస్టీల పేరిట దోపిడీ..**

సహకార బ్యాంకులు రైతులను కేవలం షేర్ అమౌంట్ పేరుతోనే కాకుండా, వివిధ రకాల అదనపు చార్జీల పేరుతో కూడా పీల్చి పిప్పి చేస్తున్నాయి.

రైతులకు ఇచ్చే బంగారు రుణాలపై బ్యాంకులు ఏకంగా 11.75 శాతం వడ్డీ రేటును వసూలు చేస్తున్నాయి.

**అప్రైజర్ చార్జీల బాదుడు**

బంగారం నాణ్యతను పరీక్షించే అప్రైజర్ ఫీజుల పేరిట ప్రతీ లోన్‌కు రూ. 100 నుండి రూ. 500 వరకు రైతుల నుంచే గుంజుకుంటున్నారు.

ఇవి కాకుండా పేపర్ చార్జీలంటూ, కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల జీఎస్టీ అంటూ బోలెడంత సొమ్మును రైతుల ఖాతాల నుంచి దండుకుంటున్నారు. అదనంగా ఈ షేర్ డిపాజిట్ల పేరుతో బ్యాంకు వారు ఖాతాదారులను పూర్తిగా బురిడీ కొట్టిస్తున్నారు.

ఇక్కడ అత్యంత దారుణమైన విషయం ఏమిటంటే.. సహకార బ్యాంకు రైతులకు ఇచ్చే అప్పుకు గాను 11.75 శాతం వడ్డీని ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. కానీ, అదే రైతుల వద్ద నుంచి షేర్ అమోంట్ పేరుతో బలవంతంగా డిపాజిట్ చేయించుకున్న సొమ్ముకు మాత్రం ఎలాంటి వడ్డీ చెల్లించడం లేదు. "మేము తీసుకున్న డబ్బులకు మేము వడ్డీ చెల్లిస్తున్నప్పుడు.. బ్యాంకు వారి వద్ద భద్రంగా ఉన్న మా సొంత షేర్ అమౌంట్ డిపాజిట్ డబ్బులకు మాత్రం బ్యాంకు వారు వడ్డీ ఎందుకు చెల్లించడం లేదు?" అని పలువురు రైతులు, ఖాతాదారులు సహకార బ్యాంకుల పక్షపాత తీరును తప్పు పడుతున్నారు. >>3

# భావి తరాల కోసం అక్షర యజ్ఞం

## గ్రంథాలయాలకు మేడోజి పుస్తకాల ఉచిత పంపిణీ



గ్రామ పూర్వ వ్యవస్థపై రచించిన పుస్తకాలు

రచయిత, దాత మేడోజి బలరాంచారి

**శామీర్‌పేట, జులై 5 ప్రభాతవార్త:** నేటి ఆధునిక కాలంలో మరుగున పడిపోతున్న పల్లెటూరి సంస్కృతిని, నాటి కులవృత్తులను, పూర్వపు పరిపాలనా వైభవాన్ని నేటి తరానికి అందించేందుకు రచయిత, దాత మేడోజి బలరాంచారి (కేశవరం) శ్రీకారం చుట్టారు. ఆయన సేవాభావంతో స్వయంగా రచించిన మూడు అద్భుతమైన పుస్తకాలను మేడ్చల్ జిల్లాలోని అన్ని గ్రంథాలయాలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఆదివారం శామీర్‌పేట శాఖా గ్రంథాలయానికి విచ్చేసిన ఆయన, గ్రంథపాలకుడు బి. పోచయ్యకు ఈ పుస్తకాలను విరాళంగా అందజేశారు.

**అక్షర రూపంలో పల్లె చరిత్ర..**

నాటి పల్లెల్లో విద్యా, వైద్యం, వ్యవసాయం, నీటి వనరులు, దేవాలయాలు, పరిపాలనా వ్యవస్థ ఎలా ఉండేదో కళ్లకు కట్టేలా 500 ప్రతులతో 'నా ఊరు యాది జేస్తుంది' పుస్తకాన్ని తెచ్చారు.

**పద్యాల్లో పల్లె పదాలు**

మేడోజు మెరుపులు పుస్తకంలో పల్లెటూరి వాతావరణం, నాటి ప్రజల జీవన విధానం, రవాణా సౌకర్యాలను జానపద పాటలు, పద్యాల రూపంలో 1,000 ప్రతులతో అద్భుతంగా మలిచారు.

**సంస్కారాల సమాహారం**

వివాహ ప్రక్రియ పుస్తకంలో పెళ్లంటే కేవలం వేడుక కాదు.. అది ఏడేడు జన్మల బంధం, ఒక మహత్తర సంస్కారం అంటూ వైవాహిక జీవిత మార్గదర్శిగా 1,000 ప్రతులతో రూపొందించారు. యువత మన మూలాలను, సంస్కృతిని మర్చిపోకూడదనే ఉద్దేశంతోనే ఈ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని మేడోజి బలరాంచారి తెలిపారు.

**జిల్లా వ్యాప్తంగా ఉచిత పంపిణీకి ప్రణాళిక**

ఇప్పటికే అలియాబాద్, దేవరయాంజాల్, కేశవరం, శామీర్‌పేట గ్రంథాలయాలకు పుస్తకాలు చేరగా, త్వరలోనే మేడ్చల్, కీసర, ఘట్కేసర్ మండలాల్లోని లైబ్రరీలకు కూడా పంపిణీ చేయనున్నట్లు దాత ప్రకటించారు. సమాజానికి ఎంతో ఉపయోగపడే పుస్తకాలను విరాళంగా అందించినందుకు గాను రచయిత బలరాంచారిని, కౌన్సిలర్ బి. మల్లేశ్యాదవ్, నాయకుడు కె. భూమేశ్ గౌడ్‌లను గ్రంథపాలకుడు బి. పోచయ్య ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామస్వామిగౌడ్, పాఠకులు వై. అంజనేయులు, నరేశ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ ఈశ్వర్

# మేడ్చల్ కాంగ్రెస్‌లో షోకాజ్ మంటలు

## జిల్లా అధ్యక్షుడిపై మాజీ సర్పంచ్ బహిరంగ తిరుగుబాటు

**మేడ్చల్, జూలై 5 ప్రభాతవార్త:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు రోజురోజుకూ ముదురుతున్నాయి. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించారంటూ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్ యాదవ్ జారీ చేసిన షోకాజ్ నోటీసు, ఇప్పుడు జిల్లా రాజకీయాల్లో పెను తుఫాను సృష్టించింది. ఈ నోటీసుకు గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ బైరి ఈశ్వర్ అంతే స్థాయిలో బహిరంగంగా కౌంటర్ ఇవ్వడం కాంగ్రెస్ శ్రేణుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఏడు రోజుల్లో వివరణ ఇవ్వాలంటూ జిల్లా అధ్యక్షుడు హెచ్చరించగా.. "నన్ను సస్పెండ్ చేసే అధికారం నీకు లేదు, నీ నోటీసులకు భయపడేది లేదు" అంటూ బైరి ఈశ్వర్ నేరుగా జిల్లా అధ్యక్షుడిపైనే ఘాటు వ్యాఖ్యలు చేశారు.

**నీకు అసలు అధికారమే లేదు: బైరి ఈశ్వర్**

గుండ్లపోచంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈశ్వర్ మాట్లాడుతూ జిల్లా నాయకత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అసలు పార్టీలో షోకాజ్ నోటీసులు జారీ చేసే అధి కారం జిల్లా అధ్యక్షుడికి ఉండదని, ఆ అధికారం కేవ లం పార్టీ క్రమశిక్షణ సంఘానికి మాత్రమే ఉంటుం దని స్పష్టం చేశారు. ఈ కనీస విషయం కూడా వజ్రేష్ యాదవ్‌కు తెలియకపోవడం శోచనీ యమన్నారు. తాను బలహీన వర్గానికి చెందిన వాడిననే కారణంతోనే, ఇలాంటి నోటీసులతో భయపెట్టి తనను రాజకీయంగా అణగదొక్కే ప్రయత్నం చేస్తు న్నారని ఆరోపించారు.

**మల్లు రవికి ఫిర్యాదు:** జంగయ్య యాదవ్ ఫోన్లో పార్టీ నాయకుల పట్ల మాట్లాడిన అనుచిత వ్యాఖ్యలపై తాను పార్టీ క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు మల్లు రవికి ఫిర్యాదు చేసి, అక్కడే ఈ విషయాన్ని తేల్చుకుంటానని సవాల్ విసిరారు. తాను పార్టీలో సీనియర్ నాయకుడినని, "నీ సీన్ ఏంటో చూద్దాం' ' అంటూ ప్రత్యక్షంగా సవాల్ విసిరారు.

**వెనుక ఉన్న ఆ పెద్ద హస్తం ఎవరిది? :** రాష్ట్ర అధిష్ఠానానికి అత్యంత సన్నిహితుడిగా పేరున్న జిల్లా అధ్యక్షుడిని, బైరి ఈశ్వర్ ఇంత బహిరంగంగా సవాల్ చేయడం వెనుక పెద్ద రాజకీయ వ్యూహమే ఉందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇది కేవలం వ్యక్తిగత అసంతృప్తా? లేక జిల్లా కాంగ్రెస్‌లో మా ర్పుల కోసం తెరవెనుక ఎవరైనా కీలక నాయకుడు ఈశ్వర్‌ను నడి పిస్తున్నారా? అనే కోణంలో కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

ఈ వివాదం పిసిసి వద్దకు చేరింది. అధిష్ఠానం తీసుకోనున్న నిర్ణయంపై ఆసక్తికరంగా మారంది.

# ఫెన్సింగ్ వైర్లలో జింక

## బంధీ అయిన మూగజీవాన్ని రక్షించిన రైతులు



**మోమిన్‌పేట్, జులై 5 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎన్కెపల్లి గ్రామంలో పంటపొలానికి ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ వైర్లలో ప్రమాదవశాత్తు చిక్కుకున్న ఓ అడవి జింక సురక్షితంగా బయటపడింది. ఆదివారం నాడు అడవి ప్రాంతం నుండి తప్పిపోయిన ఒక జింక ప్రమాదవశాత్తు ఎన్కెపల్లి గ్రామానికి చెందిన ఒక రైతు పంట పొలానికి రక్షణగా ఏర్పాటు చేసుకున్న కంచె (ఫెన్సింగ్ వైర్లు) లో ఆకస్మాత్తుగా చిక్కుకుపోయింది. వైర్ల మధ్య ఇరుక్కుపోయి కదలలేని స్థితిలో ఉన్న ఆ జింకను గమనించిన స్థానిక రైతులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా వారు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫెన్సింగ్ వైర్లలో చిక్కుకుని విలవిల్లాడుతున్న జింకను ఎంతో జాగ్రత్తగా విడిపించి రక్షించి ప్రాథమిక చికిత్స అందించారు.

# అధిష్టానం నిర్ణయంపై క్యాడర్ గుస్సా!

## డివిజన్ అధ్యక్షుడి ఎంపికలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారని ఆవేదన

## అగ్ర నేతల దృష్టికి కార్యకర్తల మనోభావాలు

## తూంకుంటలో అత్యవసర భేటీ తీర్మానం



తూంకుంటలో నిరసన వ్యక్తంచేస్తున్న శామీర్‌పేట డివిజన్ కాంగ్రెస్ అసమ్మతి నేతలు

**శామీర్‌పేట, జులై 5, ప్రభాతవార్త :** మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ రాజకీయాల్లో నియామకాల మంటలు రాజుకుంటున్న వేళ, తాజాగా శామీర్‌పేట డివిజన్ పార్టీ అధ్యక్షుడి ఎంపిక తీవ్ర వివాదానికి దారితీసింది. స్థానిక నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండానే పార్టీ అధిష్ఠానం డివిజన్ అధ్యక్షున్ని నియమించటం ఎంతవరకు సబబంటూ క్షేత్రస్థాయి క్యాడర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇటీవల శామీర్‌పేట

### శామీర్‌పేటలోనూ నియామక సెగలు..

డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నక్క సందీప్ గౌడ్ (బొమ్మరాసిపేట్)ను పార్టీ అధిష్ఠానం నియమించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ నియామకానికి ముందు స్థానిక కాంగ్రెస్ నాయకులతో కానీ, కార్యకర్తలతో కానీ ఎలాంటి సంప్రదింపులు జరపకపోవడంపై స్థానికంగా తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలోనే శామీర్‌పేట డివిజన్ పరిధిలోని పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం తూంకుంటలోని ఒక ఫంక్షన్ హాల్‌లో అత్యవసరంగా సమావేశమయ్యారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలంటే కార్యకర్తల అభిప్రాయాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని, కనీస సమాచారం లేకుండా ఇలాంటి ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సరైన విధానం కాదని ఈ సందర్భంగా పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ అసంతృప్తి అంశాన్ని పార్టీ ఉన్నత నాయకత్వం దృష్టికి తీసుకెళ్లాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. త్వరలోనే డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశాయాదవ్, మాజీ ఎమ్మెల్యే ఎం. సుధీర్‌రెడ్డి, టిపిసిసి సీనియర్ అధికార ప్రతినిధి ఎస్. హరివర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్‌లను కలిసి శామీర్‌పేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుని నియామకంపై కార్యకర్తల మనోభావాలను వివరించాలని నిర్ణయించారు. కాంగ్రెస్ పార్టీ ఐక్యత, కార్యకర్తల గౌరవం, సంస్థాగత బలోపేతమే తమ ప్రధాన లక్ష్యమని, అధిష్ఠానం స్థానిక నాయకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తగిన న్యాయమైన నిర్ణయం తీసుకుంటుందనే విశ్వాసాన్ని వారు వ్యక్తంచేశారు.



మోమిన్‌పేటలో ఆరేళ్లక్రితం నిర్మించిన కల్వర్టు

# కోట్లు పెట్టి కల్వర్టులు కట్టినా కనెక్టివిటీ ఏది?

★అనుసంధానంగా ఉన్న మూడు రహదారులను నిర్మించటంలో ఉదాసీనత ★మోమిన్‌పేట్‌లో ఆరేళ్లుగా అవస్థలు ★నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు ★తరచు ప్రమాదాలు

**మోమిన్‌పేట్, జులై 5. ప్రభాతవార్త:** మోమిన్‌పేట్ మండలంలో ప్రధాన రహదారి సమస్య గత ఆరేళ్లుగా ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. మండల పరిధిలో మూడు చోట్ల కల్వర్టులు నిర్మించినప్పటికీ, వాటికి అనుసంధానంగా వేయాల్సిన రహదారిని ఇప్పటికీ పూర్తి చేయలేదు. ఈ సమస్య గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైంది. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాల కాలం గడిచినా మోమిన్‌పేట్ మండలం అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్, శంకర్‌పల్లి మండలాలకు సమీపంలో ఉండటంతో ఇక్కడ ఫాంహౌస్‌లు, లేఅవుట్‌ల వ్యాపారం జోరుగా సాగుతోంది. హైదరాబాద్‌కు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ప్రతిరోజూ వందల సంఖ్యలో బస్సులు, లారీలు, కార్లు, ద్విచక్ర వాహనాలు ఈ దారి గుండా ప్రయాణిస్తుంటాయి. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డంతా బురదమయంగా మారుతోంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, గడిచిన సంవత్సరాలలో ప్రమాదాల వల్ల మరణాలు కూడా సంభవించాయని స్థానికులు పేర్కొంటున్నారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి కల్వర్టులు కట్టి వదిలేశారు కానీ రోడ్డు వేయడం లేదని, దీనికి ప్రభుత్వంతో పాటు ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యమే కారణమని ప్రజలు మండిపడుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రభుత్వం స్పందించి ఆరేళ్లుగా పెండింగులో ఉన్న ఈ రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేసి, శాశ్వత పరిష్కారం చూపాలని ప్రయాణికులు కోరుతున్నారు.



లింక్ రోడ్డు దుస్థితి



మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్‌ను సన్మానిస్తున్న నాయకులు

## మండల అభివృద్ధిపై మంత్రి వాకిటితో భేటీ

**కేశంపేట, జులై 5, ప్రభాతవార్త :** మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ ను ఆదివారం షాద్ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేశంపేట మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కేశంపేట మండల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్టు మండల పార్టీ అధ్యక్షుడు రమేష్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తూ, ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తోందని, తెలంగాణ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారని ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తూ, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ఆయన స్పష్టం చేసినట్లు రమేష్ తెలిపారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని, ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కేశంపేట మండలంలో కూడా అభివృద్ధి పనులకు మరింత వేగం పెంచి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేశంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనుమగల్ల రమేష్, మండల కాంగ్రెస్ నాయకులు,ఎస్టీ సెల్ అధ్యక్షులు రూప్లా నాయక్,బోధనం పల్లి సర్పంచ్ నగేష్,నిర్దవెల్లి డిప్యూటీ సర్పంచ్ సాపురా అమీర్, మల్లేష్ , నర్సింహ, యాదగిరి ప్రజాప్రతినిధులు, పాల్గొని మంత్రి గారికి శుభాకాంక్షలు తెలియజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మి

## ఉపాధ్యాయుల డిప్యూటేషన్ రద్దు చేయించండి

**జిల్లేడు చౌదరిగూడెం, జులై 5, ప్రభాతవార్త :** కీలకమైన సబ్జెక్టుల ఉపాధ్యాయులు డిప్టేషన్ పై వెళితే పాఠశాలల విద్యార్థులు నష్టపోతున్నారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు చౌదరిగూడెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాఠశాల చైర్ పర్సన్ లక్ష్మీ విన్నవించారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంకు వెళ్ళి డిప్యుటేషన్ పై వెళ్లిన ఉపాధ్యాయులను తిరిగి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆమె వినతిపత్రం అందచేశారు. .ఉన్నతాధికారులతో మాట్లాడి ఉపాధ్యాయుల డిప్యుటేషన్ రద్దు చేయించాలని ఆమె కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర్ ,నాయకులు చలివేంద్రంపల్లి రాజు,ఎజాజ్,దామోదర్ తో పాటు పలువురు ఉన్నారు.

## అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

**ఘట్‌కేసర్, జులై 5, ప్రభాతవార్త:** బీఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగ ప్రధాన శిల్పిగా సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం అనే విలువలకు బలమైన పునాది వేశారని ఘట్‌కేసర్ బిజెవైఎం అధ్యక్షులు కొమ్మిడి విక్రాంత్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌లో ఆదివారం ప్రబుద్ధభారత్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడానికి 273వ వారం నిత్యపూలమాల కార్యక్రమం నిర్వహించారు. విక్రాంత్‌రెడ్డి విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. భారత రాజ్యాంగం ప్రతి భారత పౌరుడి హక్కులను రక్షిస్తూ ప్రజాస్వామ్యానికి మార్గదర్శకంగా నిలుస్తుందని, అంబేద్కర్ 60 దేశాల రాజ్యాంగాలను చదివి భారతదేశ వర్ణ వ్యవస్థని, కులవ్యవస్థను దృష్టిలో పెట్టుకొని దేశ స్థితిగతుల కారణంగా భారత రాజ్యాంగాన్ని రూపొందించారని కొనియాడారు. పిబిఐ మేడ్చల్ జిల్లా సమన్వయకర్త మీసాల అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విక్రాంత్‌రెడ్డి అంబేద్కర్ అందించిన సేవలను, పోరాటాలను తెలియజేస్తూ ఆయన ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం తెలంగాణ తొలి అమరతేజం దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతి సందర్భంగా ఫ్లెక్సీకి పూలదండ వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అరుణ్‌కుమార్ ఈసందర్భంగా దొడ్డి కొమురయ్య జీవితచరిత్రను వివరించారు. ఈసందర్భంగా అందరూ భారత రాజ్యాంగ పీఠికపై ప్రమాణం చేశారు. మనస్సును పెంపొందించుకోవడానికి మానవ ఉనికి అంతిమ లక్ష్యం అని అంబేద్కర్ మాటలను బి.గణేశ్‌గౌడ్ సూక్తిగా చెప్పారు. ఈకార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మేకల దాసు, నాయకులు బాలనగరం గణేశ్‌గౌడ్, బి.శ్యామ్‌సుందర్‌రెడ్డి, డి.నరేశ్, బి.హరీష్, సుభాష్, ఎస్.వంశీ, కె.మహేశ్, సాయి, రామ్‌యాదవ్, రమేశ్‌నాయుడు, సాయి, కె.నర్సింగ్‌రావు, కడప రవీందర్, జి.అంజయ్య, సురేశ్‌గౌడ్, సి.నిఖిల్, శివకృష్ణ, అరుణ్‌గౌడ్, జె.అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## సర్‌పై ఓటర్లకు అవగాహన కల్పించాలి

**ఘట్‌కేసర్, జులై 5, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ మర్రిపల్లిగూడలో ఆదివారం సర్ ప్రక్రియను బీఆర్ఎస్‌పార్టీ మేడ్చల్ పరిశీలకులు రాగిడి లక్ష్మారెడ్డి పరిశీలించారు. ఓటర్లకు బిఎల్ఓ ఎమ్యూనరేషన్ పత్రాలను పంపిణీ చేసి నమోదు విధానాన్ని తెలియజేశారు. లక్ష్మారెడ్డి పాల్గొని సర్ ప్రకియపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిపి బండారి శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ మంద సంజీవరెడ్డి, మాజీ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, సహకార సంఘం మాజీ చైర్మన్ డొంకెన బిక్షపతిగౌడ్, మాజీ సర్పంచ్ కాలేరు సురేశ్, మాజీ ఎంపిటిసి మంకం రవి, మండల బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి పన్నాల కొండలరెడ్డి, సొసైటీ మాజీ డైరక్టర్ గ్యార వెంకటేశ్, నాయకులు కానుగంటి శ్రీనివాస్, కుక్కునూరి రాజశేఖర్, గడుమ్మడి దుర్గేశ్, ఎదులాబాద్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ బిఎల్ఓలు, నాయకులు పాల్గొన్నారు.

## 48 గంటలలో రేషన్ కార్డులు : మంత్రి పొన్నం

**హైదరాబాద్ జులై 4 ప్రభాతవార్త :** అర్హత ఉండి రేషన్‌కార్డులు లేనివారు దరఖాస్తు చేసు కుంటే 48 గంటల్లో కార్డులు ఇస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్ లో మంత్రి అజారుద్దీన్‌తో కలిసి నాంపల్లి, చాం ద్రాయణగుట్ట నియోజకవర్గాలకు సంబంధించి 361 మంది లబ్ధిదారులకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్ ఓవైసీ, మాజిద్ హుస్సేన్, మినరల్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవర్తి అనిల్, బోయ కార్పొరేషన్ వైస్ చైర్మన్ బోయ నగేష్, జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ "గత ప్రభుత్వం లో 10 ఏళ్లలో రేషన్ కార్డులు ఇవ్వలేదు. మేము అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నాం. అర్హత ఉండి రేషన్ కార్డులు లేనివారి అప్లై చేసుకుంటే 48 గంటల్లో ఇస్తున్నాం. వారికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం. 2016లో మీరు మీ గుడిసెలు ఖాళీ చేశారు. అదే స్థలంలో ఇల్లు నిర్మించడం జరిగింది. హైదరాబాద్‌లో పేద లకు ఉపాధి ఉన్నచోటే ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. వందలకోట్ల విలువైన భూములను పేదల ఇళ్ల నిర్మాణాలకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో లక్ష ఇళ్లు కట్టి పేదలకు ఇస్తాం. ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ లో 4050 స్థలాలు గుర్తించాం" అని అన్నారు. "గత ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్ రూమ్స్ ఇస్తామని ఆశ చూపెట్టి మోసం చేసింది. వాళ్లు కట్టిన ఇళ్లు నగరానికి దూరంగా ఉన్నాయి. రాష్ట్రం లో ప్రతీ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చాం. మొదటి దశలో నియోజకవర్గానికి 3500 ఇంది రమ్మ ఇళ్లు ఇచ్చాం. ఇవి పూర్తయ్యాయి. రెండవ దశలో 2 వేల ఇళ్లు ఇస్తున్నాం. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం.500కి గ్యాస్ సబ్సిడీ ఇస్తున్నాం. మహిళలందరూ స్వయం సహాయక సంఘాలలో జాయిన్ అవ్వాలి. నగరంలో మహిళా సంఘాల్లో సంఖ్య పెంచాలని అధికారులను ఆదేశించాం. మహిళా సంఘాలకు వడ్డీలులేని రుణాలు ఇస్తున్నాం. రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లాలన్న ఉచిత బస్సు సౌకర్యం అందిస్తున్నామని తెలిపారు.

# ఆధునిక వసతులతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల

**పరిగి, జులై 5, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా, పరిగి పట్టణంలో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలను అత్యాధునిక వసతులతో నిర్మిస్తామని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి తెలిపారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధృడసంకల్పంతో రూ.200 కోట్లను కేటాయించి,భవిష్యత్ తరాలకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని టి.ఆర్.ఆర్. పేర్కొన్నారు. అన్ని సామాజిక వర్గాల ఒకేచోట విద్యను అందించాలనే లక్ష్యంతోప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ పాఠశాలను నిర్మిస్తుందని,విద్యతో పాటు ఆటలు, టెక్నాలజీని అందుబాటులో ఉంచేలా నిర్మాణం జరుగుతుందన్నారు. ఆదివారం ఎమ్మెల్యే పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించారు..పరిగిలో నిర్మాణంలో ఉన్న పాఠశాల పనులను వేగంగా పూర్తి చేసి, వచ్చే విద్యా సంవత్సరంలోనే విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ పార్థసారథి పంతులు, మున్సిపల్ చైర్మన్ రంజిత వెంకటేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అయూబ్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ రాజపుల్లారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, పరిగి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్రాములు, కౌన్సిలర్ అఖిల, బాదం శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఇంటిగ్రేటెడ్ పాఠశాల నమూనా పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ధారాసింగ్

## సొంతింటి కల సాకారం కాంగ్రెస్‌తోనే సాధ్యం

**పెద్దేముల్, జులై 5, ప్రభాతవార్త:** పేదోడి సొంతింటి కళ సాకారం కాంగ్రెస్‌తోనే సాధ్యమని జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు ధారాసింగ్ అన్నారు. ఆదివారం పెద్దేముల్ మండలం గొట్లపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ళ పథకం లబ్ధిదారులైన బంటు వాణిశ్రీ, కిష్టప్పకు చెందిన నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి ధారాసింగ్ హజరయ్యారు. ఈ సందర్భంగా ధారాసింగ్ మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబం సొంతి ఇంటి కళను సాకారం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఇందిరమ్మ ఇళ్ళ పథకం వేలాది కుటుంబాల్లో కొత్త ఆశలను నింపుతుందని అన్నారు. నూతన గృహంలోకి అడుగుపెట్టిన కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్ళు పిల్లపాపలతో సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండి వేయి శుభాలు కలుగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఉత్తంచంద్, నర్సిములు, ఏ బ్లాక్ అధ్యక్షులు లొంక నర్సిములు, గ్రామ సర్పంచ్ మహ్మద్ సలాం, ఉపసర్పంచ్ చంద్రప్ప, నాయకులు గోరె పటేల్, చాంద్‌పాష, మహ్మద్ రఫీక్, అంతప్ప, నర్సప్ప, భీంరెడ్డి, అంజిలప్ప, రవి, శ్రీను, రాంరెడ్డి, మహమూద్ అలీ, అనిల్‌రెడ్డి, యాదప్పగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బీరప్ప దేవాలయ విగ్రహ ప్రతిష్ట

**ఘట్‌కేసర్, జులై 5, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ మర్రిపల్లిగూడలో శ్రీఅక్క మహంకాళీ, శ్రీబీరప్పస్వామి సమేత శ్రీకామరాతిదేవి శ్రీబుగ్గపోచమ్మ దేవి, ధ్వజస్తంభం విగ్రహ ప్రతిష్టాపన ఘనంగా నిర్వహించారు. కురుమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈనెల 3 నుంచి శతాధిక ప్రతిష్టాచార్య ప్రవర గ్రహీత బ్రహ్మ శ్రీరావిరాల పరమేశ్వరశాస్త్రి ఆచార్యత్వంలో వైదిక బృందం ప్రతిష్టా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం గవ్యాంతపూజలు, మార్జనలు, గర్తన్యాసం, పీఠన్యాసం, ధాతున్యాసం, యంత్రస్థాపన, బింబస్థాపన, మూలమంత్ర హోమాలు, మహపూర్ణాహుతి, ప్రాణప్రతిష్ట, కుంభదృష్టి, దొదృష్టి, మహకుంభాభిషేకం, నీరాజన మంత్రపుష్పాలు, మహదాశీర్వచనం, పండిత సన్మానం నిర్వహించారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిలు విచ్చేసి ధ్వసస్తంభ ప్రతిష్టలో పాల్గొనగా నిర్వహకులు వారిని సత్కరించారు. వేదపండితుల మంత్రోచ్చారణాలతో ఆలయ ప్రాంగణంలో ఎతైన రాతి ధ్వజస్తంభాన్ని క్రేన్ సహాయంతో ప్రతిష్టంచారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈసందర్భంగా విచ్చేసిన నాయకులను కురుమ సంఘం సభ్యులు శాలువాలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, బిజెపి మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్, రాష్ట్రకార్యవర్గసభ్యులు–మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపిపి బండారి శ్రీనివాస్‌గౌడ్, మాజీ వైస్ ఎంపిపి ఎదుగని క్రిష్ణమూర్తి, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ నానావత్ రెడ్డియానాయక్, మాజీ ఎంపిటిసిలు మంకం రవి, నాగులపల్లి రమేశ్, గడ్డిఅన్నారం మార్కెట్ మాజీ డైరక్టర్ పన్నాల కొండల్‌రెడ్డి, సహకార సంఘం డైరక్టర్లు చందుపట్ల ధర్మారెడ్డి, మాజీ డైరక్టర్ గ్యార వెంకటేశ్, బిజెవైఎం అధ్యక్షులు కొమ్మిడి విక్రాంత్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మాయ నరేశ్, కురుమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఫ్యూచర్ సిటీ భూసేకరణపై నిరసన..

### ప్రజా కోర్టులో కన్నీరు మున్నీరైన రైతులు

**రంగారెడ్డి అర్బన్, ప్రభాతవార్త:** ఫ్యూచర్ సిటీ, ఫార్మాసిటీ పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు పోరాటం ఆపేది లేదని బాధితులు, ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ నేతలు స్పష్టం చేశారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా తాటిపర్తి గ్రామంలో ఫార్మాసిటీ, ఫ్యూచర్ సిటీ భూసేకరణ సమస్యలపై భారీ ప్రజా అభిప్రాయ సేకరణ సభ (ప్రజా కోర్టు) జరిగింది. టీపీజేఏసీ కోకన్వీనర్ కన్నెగంటి రవి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల నాలుగు గ్రామాల నుంచి వేలాదిగా రైతులు, మహిళలు, వ్యవసాయ కూలీలు తరలివచ్చారు. ఈ సందర్భంగా బాధితులు తమ ఆవేదనను, ఆక్రోశాన్ని జ్యూరీ సభ్యుల సమక్షంలో కన్నీటి పర్యంతమవుతూ వివరించారు. అధికారులు చట్టాలను అతిక్రమించి, పోలీసు బలగాలతో రైతులను భయభ్రాంతులకు గురిచేస్తూ భూములను గుంజుకునే ప్రయత్నం చేస్తున్నారని వారు తీవ్రంగా ఆరోపించారు. తరతరాలుగా నమ్ముకున్న భూములే తమకు జీవనాధారమని, ప్రాణాలు పోయినా సరే భూములను వదులుకునే ప్రసక్తే లేదని రైతులు, కూలీలు ముక్తకంఠంతో తేల్చిచెప్పారు. భూసేకరణ ప్రక్రియలో జరుగుతున్న దౌర్జన్యాలపై ప్రభుత్వం తక్షణమే వెనక్కి తగ్గాలని డిమాండ్ చేశారు. ఈ పబ్లిక్ హియరింగ్ సమావేశానికి కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే వంశీ చంద్ రెడ్డి హాజరై ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ భూసేకరణ సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం అధిష్టానానికి తీసుకువెళ్లి, పరిష్కరించే దిశగా తన వంతు కృషి చేస్తానని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. ఈ ప్రజా కోర్టుకు రాష్ట్రంలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు జ్యూరీ సభ్యులుగా హాజరై, రైతుల వాదనలను క్షుణ్ణంగా విన్నారు. జ్యూరీలో సీనియర్ అడ్వకేట్ వి. రఘునాథ్, మానవ హక్కుల వేదిక జాతీయ కమిటీ సభ్యులు ఎస్. జీవన్ కుమార్, సీనియర్ జర్నలిస్ట్ వి. వసంత లక్ష్మి, శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సుజాత సురేపల్లి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ విజయ్, రిటైర్డ్ తాసిల్దార్ వి. బాలరాజ్ లు ఉన్నారు. ఈ సందర్భంగా జ్యూరీ సభ్యులు మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో రైతుల నుంచి సేకరించిన ప్రతి అక్రమాన్ని, దౌర్జన్యాన్ని తాము సమగ్రమైన రిపోర్టుగా తయారు చేస్తామని ప్రకటించారు. బాధితులకు అండగా నిలిచిన స్థానిక ప్రజాప్రతినిధులు, నాలుగు గ్రామాల సర్పంచులు నీలం శ్రీవిద్య, నీలం ఝాన్సీ, సంగం చైతన్యలతో పాటు ఫార్మా వ్యతిరేక కమిటీ సభ్యులు కానేమోని గణేష్, సందీప్, కొండల్ రెడ్డి, సమ నిరంజన్, అచ్చి రెడ్డి, కుందారపు నారాయణ, చెన్నయ్య, దేవోజీ, వినోద్ రెడ్డి, సోమయ్య, అనంత్ రెడ్డి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని రైతులకు మద్దతు ప్రకటించారు. ప్రభుత్వ మొండి వైఖరి వీడే వరకు తమ పోరాటం ఆపబోమని కమిటీ నేతలు ఈ సభ ద్వారా స్పష్టం చేశారు.

## భార్యను హత్య చేసిన నిందితుడికి రిమాండ్

**ఉప్పల్, జులై 5 ప్రభాతవార్త :** ఉప్పల్ ఆదర్శనగర్ అనుమానంతో భార్యను హత్య చేసిన నిందితుడిని ఉప్పల్ పోలీసులు ఆదివారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ చిరం జీవి కథనం ప్రకారం.. ఉప్పల్ ఆదర్శ నగర్‌లో నివసించే పాపితోట్టి జెస్సికా (37)ను ఆమె భర్త పాపితోట్టి సురేష్ (42) కత్తితో పొడిచి హత్య చేసిన విష యం తెలిసిందే. దీంతో మృతురాలు తమ్ముడు జేపనియ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.నిందితుడు పాపితోట్టి సురేష్‌ను శనివారం రాత్రి ముషీరాబాద్‌లో అదుపులోకి తీసు కొని విచారించగా, నిందితుడు తన భార్య మీద అనుమానంతో ఆమె నిద్రపోయిన సమయంలో కత్తితో పొడిచి చంపినట్లు అంగీకరించాడని తెలిపారు.



సుంకిరెడ్డికి ఆయన చిత్రపటాన్ని అందజేస్తున్న శిక్షణార్థులు

## ఆత్మవిశ్వాసంతోనే లక్ష్య సాధన

**ఆమనగల్లు, జులై5, ప్రభాతవార్త:** ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఐక్యత ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, సాధించాలనే పట్టుదల ఉంటే విజయం తప్పకుండా వరిస్తుందని ఆయన ఉద్ఘాటించారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు నిర్వహిస్తున్న పోలీస్ ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల సాధనకు అందిస్తున్న ఉచిత శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో సుంకిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈసంధర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత కలలకు ఆర్థిక ఇబ్బందులు ఎదురుకాకూడదనే ఆశయంతో ఐక్యత ఫౌండేషన్ 70 రోజులపాటు కల్వకుర్తి నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ఉద్యోగ సన్నదతకు ఉచిత శిక్షణ శిబిరం ఏర్పాటు చేసిందన్నారు. ఆర్థిక భారంతో ఎంతోమంది మెలుకువలు తెలియక తమ ఆశయాన్ని సాధించుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే వారికి తోడ్పాటునందించేందుకు ఐక్యత ఫౌండేషన్ చేయూతనందించిందని చెప్పారు. నిరుద్యోగ యువతీయువకులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు నిర్వర్తిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశయం కొరకు తెలంగాణ టాస్క్ సీఓఓగా తమ బాధ్యతలను సైతం సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నామని, పరిశ్రమలలో ఎంతోమందికి ఉపాధి మార్గాలను చూపిస్తున్నట్లు, ప్రస్తుతం సద్వినియోగం చేసుకున్న ఎన్నో కుటుంబాలు ఆర్థిక కష్టాలను అధిగమిస్తున్నాయని కొనియాడారు. త్వరలోనే పోలీస్‌శాఖలో ఖాళీల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని, శిక్షణ పొందిన యువతీయువకులు పూర్తి సన్నదంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు విశ్వనాథ్, ఫౌండేషన్ ప్రతినిధులు రచ్చ శ్రీరాములు, భాస్కర్, చంద్రశేఖర్, శివ తదితరులు ఉన్నారు.




నిరసన తెలుపుతున్న దళిత కుటుంబాలు

## దేవాలయ స్థలం కబ్జా చేస్తే ఉపేక్షించం

**ఆమనగల్లు, జులై5, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణ సమీపంలోని సందబావి ప్రాంతంలో తరాల నుండి ఉన్న ఎల్లమ్మ తల్లి దేవాలయం కబ్జాకు యత్నం జరుగుతుందని పలు దళిత కుటుంబాలు ఆదివారం నిరసన చేపట్టాయి. అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు లందం చిన్న జంగయ్య ఆధ్వర్యంలో పలు కుటుంబాల ప్రజలు ఆంధోళన నిర్వహించాయి. గ్రామకంఠంకు సంబంధించిన దేవాలయ స్థలంలో కొంతమంది ఉద్దేశపూర్వకంగా కబ్జాకు ప్రయత్నిస్తున్నారని లందం చిన్న జంగయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కబ్జా గురించి ప్రశ్నించిన దళితులపై అక్రమ కేసులు బనాయించి ఏడాది కాలంగా ఇబ్బందులు సృష్టిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షుడు కావలి శ్రీశైలం, కందుకూరు డివిజన్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్సు అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు జంతుక శంకర్, అంబేద్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షులు వస్పుల సురేష్, కొమ్ము శ్రీశైలం, వస్పుల శేఖర్, మీసాల రమేష్, అప్పుర్, జంతుక కిరణ్, శివ, కృష్ణ, శేఖర్, శ్రీశైలం, రాములమ్మ, వెంకటమ్మ, ఎల్లమ్మ, రాంచంద్రమ్మ, యాదమ్మ, బాల్‌రాం, రాజు తదితరులు ఉన్నారు.

## సర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించండి

**ఘట్‌కేసర్, జులై 5, ప్రభాతవార్త:** ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కోసం నిర్వహిస్తున్న సర్ కార్యక్రమాన్ని సక్రమంగా కొనసాగించాలని బీఆర్ఎస్‌పార్టీ మేడ్చల్ పరిశీలకులు రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ డివిజన్‌లో ఆదివారం ఆయన సర్ ప్రక్రియ జరుగుతున్న తీరును పరిశీలించి బిఎల్ఓలకు అవసరమైన సూచనలు చేశారు. అనంతరం మైసమ్మగుట్టకాలనీలో ప్రజలకు ఎన్యూమరేషన్ ఫారం అందజేసి నమోదుపై వివరించారు. 2002కు మందు ఓటు కల్గి ఉంటే లేకుంటే ఫారం ఎలా పూర్తి చేయాలనే విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని లక్ష్మారెడ్డి సూచించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిపి బండారి శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ మంద సంజీవరెడ్డి, మాజీ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి మేకల నర్సింగ్‌రావు, మాజీ కౌన్సిలర్లు చందుపట్ల వెంకట్‌రెడ్డి, కొమ్మగోని రమాదేవి, బండారఇ అంజనేయులుగౌడ్, కొమ్మిడి అనురాధ, బేతాల నర్సింగ్‌రావు, మాజీ ఉపసర్పంచ్ ఎంపాల సుధాకర్‌రెడ్డి, నాయకులు అబ్దుల్‌అజీజ్, బొక్క విష్ణువర్ధన్‌రెడ్డి, కుతుబుద్దీన్, వరికుప్పల లింగస్వామి, బిఎల్ఓలు పాల్గొన్నారు.

## గంజాయి విక్రయ ముఠా అరెస్ట్

### 1.040 కిలోల గంజాయి స్వాధీనం

**జూబ్లీహిల్స్, జులై 5, ప్రభాతవార్త :** గంజాయి సరఫరా చేస్తున్న ముఠాపై దాడిచేసి నలుగురిని అరెస్టు చేశారు. వారినుంచి 1.040 కిలోల గంజాయి, 4 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం రోడ్డు 41లోని ప్లాట్ నంబర్ 1090 వద్ద తనిఖీలు నిర్వహించగా పెరుమాళ్ల రవికుమార్, ఎర్రమ్ శెట్టి సోమసూర్యశేఖర్ అలియాస్ నాని, రక్సీస్ దేరమ్ రాజు అలి యాస్ బబ్లూ, కురుమ హరీష్ అలియాస్ పండు గంజాయి సరఫరా చేస్తూ పట్టుబడ్డారు. విచారణలో బెంగుళూరుకు చెందిన సంజీవ్‌చౌదరి సహ మరి కొందరి నుంచి వాట్సాప్‌ద్వారా ఆర్డర్లు తీసుకుని గంజాయి కొనుగోలు చేసి నగరంలో సరఫరా చేస్తున్నట్లు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. కేసు లో 15 మందిపై కేసు నమోదుచేయగా నలుగురిని అరెస్టుచేసి మరో 11మంది పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



విగ్రహ ప్రతిష్ట ఉత్సవంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్

## ఘనంగా నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్ట

**మేడ్చల్, జులై 5 ప్రభాతవార్త :** మేడ్చల్ సర్కిల్‌లోని కిష్టాపూర్ అర్చన కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో నల్ల పోచమ్మ దేవత విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారు జామున 3.30 గంటల నుండి కర్మణః పుణ్యాహ వాచనం, గర్తన్యాసం, బీజన్యాసం, ధాతున్యాసం, యంత్రస్థాపన నల్లపోచమ్మ పరివార, విగ్రహాల ప్రతిష్ట ప్రాణప్రతిష్ట, పూర్ణాహుతి, కలశ పూజ, హారతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవంలో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకుని పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిసిసి మాజీ అధ్యక్షుడు హరి వర్దన్ రెడ్డి, మేడ్చల్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్, బీజేపీ మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షురాలు శైలజా హరినాథ్, ఉపాధ్యక్షుడు రామచంద్రారెడ్డి, మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోమారం బాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ డివిజన్ అధ్యక్షుడు చాపరాజు, ఆయా పార్టీల నాయకులు శేఖర్ గౌడ్, దేవ, భాస్కర్ యాదవ్, నవీన్ రెడ్డి, దయానంద్ యాదవ్, అర్జున్, మధుసూదన్‌రెడ్డి, తుడుం గణేష్, మోహన్ రెడ్డి, నర్సింగ్ రావు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి, కౌన్సిలర్లు

**వనదుర్గ అమ్మవారి ఆలయంలో ..**

శామీర్‌పేట, జులై 5, ప్రభాతవార్త : మురహరిపల్లి గ్రామంలో వనదుర్గ అమ్మవారి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ట పూజలు ఘనంగా జరిగాయి. దీనిలో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఆదివారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపాల్టీ పరిధిలోని మురహరిపల్లిలో వనదుర్గ అమ్మవారి ఆలయాన్ని నిర్మించి విగ్రహాల ప్రతిష్ట సందర్భంగా ప్రత్యేక పూజలు, యజ్ఞ హోమం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్న మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డిని ఆలయ నిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు యూసుప్‌బాబ, ఎల్.హనుమాన్‌దాస్, గుర్కు కుమార్‌యాదవ్, దాసరి రవి, మండల మాజీ జడ్పీటిసి ఎం.అనితలాలయ్య, మండల బిఆర్ఎస్ నాయకులు ఎస్.మోహన్‌రెడ్డి, వంగ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచు సి.శ్రీనివాస్‌రెడ్డి, మేడ్చల్ ఎఎంసి మాజీ వైస్‌చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, పలువురు నాయకులు, నిర్వాహకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

**తలకొండపల్లి జులై 5, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని మెదక్ పల్లి గ్రామానికి చెందిన సాన మోని రాములమ్మ(85), శుక్రవారం రాత్రి మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యానికి గురైన రాములమ్మ మృతి చెందడంతో శనివారం నాడు జర్నలిస్ట్ నాయకులు దరువుల శంకర్, మాజీ ఉప సర్పంచ్ నరేష్ రాజులు మృతురాలి కుటుంబ సభ్యులను ప్రమర్శించారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న రాములమ్మ మృతిచెందడంతో కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తపరిచారు. అనంతరం ఉప్పల ట్రస్ట్ నుంచి 3000 రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు నాయకులు దరువుల శంకర్, మాజీ ఉపసర్పంచ్ షానముని నరేష్ రాజ్, బి ఆర్ఎస్ నాయకులు మార్చి మల్లయ్య, వార్డు సభ్యులు దరువుల యాదయ్య, రజినీకాంత్, దరువుల గోపాల్, పాండు భద్రి, మహేష్, పాండు, సంతు మహేష్ శ్రీశైలం రవి బాలు సాయి తదితరులు ఉన్నారు.



ఇందిరమ్మ లబ్ధిదారులతో అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కె.శిరీషకృష్ణారెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్

## పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వరం

**శామీర్‌పేట, జులై 5, ప్రభాతవార్త :** యాడారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కె.శిరీషకృష్ణారెడ్డి ప్రారంభించారు. లబ్దిదారులతో గృహప్రవేశం చేయించారు. ఆదివారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని యాడారం గ్రామంలో (12వ వార్డులో) మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కె.శిరీషకృష్ణారెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్‌లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేయటం పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వరంగా మారిందని సొంతింటి కలను నెరవేరుస్తుందని వారు అన్నారు. ప్రభుత్వం అభివృద్ధితో పాటు సంక్షేమంకు కృషి చేస్తుందన్నారు. దీనిలో స్థానిక కౌన్సిలర్ లింగొళ్ల హనుమాన్‌దాస్, కౌన్సిలర్ ముద్దం సుదాకర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి ఎస్.అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచు వై.సుజాత, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి భూమిరెడ్డి నవీన్‌రెడ్డి, నాయకులు కోడూరి దినేష్, తూము శ్యామ్, మణికొండ నవీన్, కొమ్ము వినోద్, చిటుకుల రాజశేఖర్‌రెడ్డి, ఎ.వినోద్‌గౌడ్, పి.నర్సింలు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల కనీస వేతనాలకు ఆమోదం

**శామీర్‌పేట, జులై 5, ప్రభాతవార్త :** శామీర్‌పేటలోని భాగ్యనగర్ గ్యాస్ (సిఎన్‌జి) డ్రైవర్లు, సిబ్బంది చేసిన పోరాటం ఫలించిందని హెచ్‌ఎంఎస్ ప్రసిడెంట్ రెబ్బ రామారావు పేర్కొన్నారు. నగరంలోని సెంట్రల్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో కార్మికుల డిమాండ్ల విషయంపై చర్చించటం జరిగిందని, కార్మికుల కనీస వేతనాల ఒప్పందం అధికారికంగ ఆమోదం పొందినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా హెచ్‌ఎంఎస్ ప్రసిడెంట్ రెబ్బ రామారావు మాట్లాడుతూ భాగ్యనగర్ గ్యాస్ డ్రైవర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్‌కు చెందిన 150మంది డ్రైవర్లు గత కొన్నేళ్లుగా అందిస్తున్న సేవలను గుర్తిస్తూ వారి న్యాయపరమైన హక్కులు, కనీస వేతనాల కోసం సాగించిన పోరాటం ఎట్టకేలకు విజయవంతంమైందన్నారు.



ఈ చారిత్రక విజయానికి అండగా నిలిచిన సంపూర్ణ సహకారం అందించిన హెచ్‌ఎంఎస్ నాయకత్వానికి యూనియన్ నాయకులు దన్యవాదాలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన మ్యాన్ పవర్ ఉద్యోగుల డిమాండ్లను త్వరలోనే సాధించుకుంటామని విజయం సాధించిన కార్మికులందరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ డప్పు సాయిబాబు, జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్, యూనియన్ ప్రతినిధులు రమేశ్, పద్మారెడ్డి, శంకర్ నాయక్, నరేందర్, సుధాకర్‌రెడ్డి, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

# బాంగారానికి బేడీలు

(మొదటి పేజీ తరువాయి)

సహకార బ్యాంకులు అనుసరిస్తున్న ఈ నిలువు దోపిడీ విధానంపై వికారాబాద్ జిల్లా రైతాంగంలో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమ వుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత సహకార శాఖ ఉన్నతాధికారులు, జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించాలని రైతులు కోరుతున్నారు. బంగారు రుణాలపై షేర్ డిపాజిట్ల పేరుతో వసూలు చేస్తున్న డబ్బులకు కూడా బ్యాంకులు తక్షణమే వడ్డీ రేటును వర్తింపజేసి, రైతులకు వడ్డీ చెల్లించాలి. ఒకవేళ వడ్డీ చెల్లించలేని పక్షంలో, ఖాతాదారులు తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాల విలువకు తగ్గట్లుగా, ఎలాంటి అనవసరపు కోతలు (షేర్ అమౌంట్ కటింగ్స్) లేకుండా పూర్తి రుణ నగదును అన్నదాతల చేతికి అందించాలని కోరుతున్నారు.

## మాదిగ జాతి పండుగ జరుపుకోవాలి

**ఆమనగల్లు, జులై5, ప్రభాతవార్త:** మాదిగల హక్కులు, వర్గీకరణ సాధనకై అలుపెరుగని పోరాటం చేసిన ఎంఆర్పీఎస్‌ను గౌరవిస్తూ జూలై7 జరిగే ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవంను మాదిగ జాతి పండుగగా ఆవర్గీయులు జరుపుకోవాలని ఎంఆర్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి జిల్లా ఇంఛార్జి రాగల్ల ఉపేందర్ మాదిగ అన్నారు. మాదిగలకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదుర్కొనేందుకు మందకృష్ణ మాదిగ ఎంఆర్పీఎస్‌ను స్థాపించి ఎస్సీ వర్గీకరణను సాధించడమే కాకుండా ఎన్నో సమస్యలకు పరిష్కారం, మాదిగ జాతిని ఏకం చేశారని కొనియాడారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం మండల పార్టీ అధ్యక్షుడు శ్రీశైలం అధ్యక్షతన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సాధించిన వర్గీకరణతో మాదిగ నిరుద్యోగ యువతీ యువకులు తొమ్మిది శాతం రిజర్వేషన్‌ల ఫలాలు సద్వినియోగం చేసుకుని ఉద్యోగ రంగాలలో విజయం సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. మాదిగ హక్కుల కొరకే కాకుండా సబ్బండ వర్గాల హక్కుల సాధన కొరకు ఎంఆర్పీఎస్ విశేషంగా కృషి చేసిందన్నారు. మూడు దశాబ్దాల పోరాటంలో ఎన్నో అవమానాలు, అడ్డంకులను దాటుకుంటూ మొక్కవోని ఆత్మవిశ్వాసంతో ఎంఆర్పీఎస్ ఎస్సీ వర్గీకరణ సాధించిందన్నారు. ఎంఆర్పీఎస్ జెండాలను గ్రామగ్రామాన ఎగురవేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అక్షరాస్యతపై అవగాహన లోపంతో మాదిగలు నిరక్షరాసులుగానే మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక స్వావలంభన సాధించాలంటే మాదిగలు చదువుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ, మండల అధ్యక్షుడు కావలి శ్రీశైలం, ఉపాధ్యక్షుడు శ్రీరామ్, రాకేశ్, వంశీ, సాయిరాం తదితరులు ఉన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**మోమిన్‌పేట్, జులై 5. ప్రభాతవార్త:** మోమిన్‌పేట్ మండల పరిధిలోని ఎన్కెపల్లి గ్రామానికి చెందిన దాసరి రాజు తండ్రి చెంద్రయ్య ఇటీవల గ్రామ సమీపంలో రైలు ప్రమాదంలో మృతి చెందాడు. గ్రామంలోని 7వ, వార్డు సభ్యుడు కిందింటి అనీల్ కుమార్ తన చరవాణి ద్వారా మృతి చెందిన రాజు కుటింభీకులకు ఆర్థిక సహాయం కొరకు తోచిన సహాయం చేయాలని వాట్సాప్ మెసేజ్ పెట్టడంతో రాజు కుటింభీకులకు 46700, రూపాయల నగదును ఆదివారం స్థానిక సర్పంచ్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు కోస్గి సురెందర్, ఉప సర్పంచ్ అబ్దుల్ మన్నాన్ చేతుల మీదుగా అందజేశారు. మృతుడు రాజుకు భార్య ప్రవీణ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ సంధర్భంగా సర్పంచ్ కోస్గి సురెందర్ మాట్లాడుతు గ్రామంలో ఎవరికి ఎలాంటి ఆపదలో ఉన్నవారికైనా ఇలాంటి యువత మంచి ఆలోచనతో ఎదుటివారి కష్టాలకు తోడుగా ఉండేందుకు 7వ,వార్డు సభ్యుడు కిందింటి అనీల్ కుమార్ లాంటి యువకుడు మన గ్రామానికి ఆదర్శం అని,అతను పెట్టిన ఒక్క వాట్సాప్ మెసేజ్ తో గ్రామ యువకులు గ్రామ పెద్దలు ముందుకొచ్చి ఆర్థిక సహాయం చేయడం అభినందనీయమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, గ్రామ పెద్దలు కోస్గి దుర్గయ్య, దనుగారి నర్సింలు, దాసరి రాంచెంద్రయ్య, డి. అనీల్ కుమార్, పి. సంపత్, డి. విధ్యాసాగర్, టి. రాజు, కే. బాల్‌రాజు గ్రామస్తులు, యువకులు, పార్టీ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కును నిర్లక్ష్యం చేయవద్దు

**పెద్దేముల్, జులై 5, ప్రభాతవార్త:** మన ఓటు హక్కును మనం నిర్లక్షం చేయవద్దని తాండూరు బీజేపి ఫ్లోర్ లీడర్, 28వ వార్డు కౌన్సిలర్ నాగారం మల్లేశం అన్నారు. ఈ సందర్భంగా నాగారం మల్లేశం మాట్లాడుతూ మన ఓటు హక్కును మనం నిర్లక్షం చేసి ఓటు కోల్పోతే మనం బతికున్న చచ్చిన శవంతో సమానమని అన్నారు. ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ పత్రాలు తీసుకొని మన ఓటు బాధ్యతగా వచ్చిన బిఎల్ఓలకు సహకరించి తిరిగి ఇస్తేనే ఓటు హక్కు కన్‌ఫార్మ్ అవుతుందని అన్నారు. ప్రతి ఓటరు జాగ్రత్త పడి ఇంటి పెద్దలు, కాలనీ పెద్దలు, కుల పెద్దలు, వ్యాపారస్తులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు అందరం కలిసి ఓటు హక్కుని అందరికి కల్పించే విధంగా ప్రయత్నం చేద్దామని అన్నారు. 100 శాతము ఓట్లను కాపాడుకునే భాధ్యత మన అందరిపై ఉందని గుర్తుచేశారు.

## నిధులు మంజూరు చేయండి

**శామీర్‌పేట, జూలై 5, ప్రభాతవార్త :** లాల్‌గడిమలక్‌పేట్‌లోని మాలవాడలో మురికి కాలువ సమస్యగా మారిందని, మురికినీరు నిల్వ ఉండటంతో ప్రజలకు ఇబ్బందిగా మారిందని డ్రైనేజీ కాలువ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్‌ను అలియాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ కైర గణేశ్ వినతిపత్రాన్ని అందజేశారు. శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని లాల్‌గడిమలక్‌పేట్‌లో మాలవాడలో మురికి కాలువ మురికి నీరు నిల్వ ఉండి ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారిందని, మురికి కాలువ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ఎంపి ఈటల రాజేందర్‌ను వినతిపత్రాన్ని అందజేసి కోరినట్లు కౌన్సిలర్ కైర గణేశ్ పేర్కొన్నారు. వర్షాకాలంతో మాలవాడలో మరింతగ మురికి నీటి నిల్వ ఉండటంతో స్థానిక ప్రజలకు, పిల్లలకు, వాహనాల రాకపోకలకు కూడ ఇబ్బందిగా మారిందని, నిధులు మంజూరు చేయాలని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్‌ను కౌన్సిలర్ కైర గణేశ్ కోరారు.

# అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదు

**దౌల్తాబాద్, జులై 5, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇంచార్జి ఎనుముల తిరుపతిరెడ్డి, కాడా స్పెషల్ ఆఫీసర్ వెంకటరెడ్డి, మరికొందరు నాయకులపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను, నిరాధారమైన ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖండించారు. ఈ మేరకు సదరు నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారంరోజు దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ..బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను ఖండించారు. ఎనుముల తిరుపతిరెడ్డి తన రాజకీయ ప్రస్థానంలో మచ్చలేని నాయకుడిగా గుర్తింపు పొందారని ఆయనపై, కాడా స్పెషల్ ఆఫీసర్ వెంకటరెడ్డిపై, మరికొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులపై వేరుశనగ పల్లీల కొనుగోలు విషయంలో డబ్బులు తీసుకున్నారని చేస్తున్న ఆరోపణలు పూర్తి అవాస్తమని కొట్టిపారేశారు. రాజకీయ లబ్ధి కోసం, వ్యక్తిత్వ హననం చేసేలా అసత్య ప్రచారాలు చేస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని వారు హెచ్చరించారు. నిరాధారమైన ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న బీఆర్ఎస్ నాయకులపై చట్పరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజజా ప్రతినిధులు కలిసి దౌల్తాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. అబద్ధపు ప్రచారాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు ఈ సందర్భంగా పోలీసులను కోరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు దస్తప్ప, నర్సింహా, షకీల్ మహమ్మద్, సాయిలు, శ్రీనివాస్, అశోక్ గౌడ్, రవితేజ, రవికుమార్, భీమ్‌రెడ్డి, భాస్కర్, ఉద్దపు రెడ్డి, అంజి, గుండేపల్లి వెంకటప్ప, ఆంజనేయులు, రామ్ తదితరులు పాల్గొన్నారు.



బిఆర్ఎస్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నేతలు

# తింసాన్‌పల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుదాం

**పెద్దేముల్, జులై 5, ప్రభాతవార్త:** తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సహకారంతో తింసాన్‌పల్లి గ్రామం అభివృద్ధి పథంలో దూసుకెళుతుందని మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు రుద్రారం పి.మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పెద్దేముల్ మండలం తింసాన్‌పల్లిలో రూ.3 లక్షల నిధులతో సీసీ రొడ్డు పనులను సర్పంచ్ గుడిసే చంద్రకళతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ తింసాన్‌పల్లి గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. గ్రామానికి అధిక నిధులు కేటాయించి రొడ్డు, డ్రైనేజిలు, వీధి దీపాలు, తాగునీరు తదితర మౌళిక సదుపాయాల అభివృద్ధికి కృషిచేస్తున్నారని అన్నారు. అభివృద్ధి పనులను పారదర్శకంగా, నాణ్యతగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. గ్రామ అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టాలని ప్రభుత్వాన్ని, ఎమ్మెల్యేను కోరుతున్నామని అన్నారు. గ్రామ ప్రజలందరి తరపున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. ప్రజల సహకారంతో గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అందరం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మైనార్టీ కన్వీనర్ యండి,రియాజ్, ఉపసర్పంచ్ పల్లె ముకుంద, శ్రీనివాస్, గ్రామ కమిటి అధ్యక్షులు అనిఫ్, ఉపాద్యాక్షులు రవి, వార్డు మెంబర్ జోగు క్రిష్ణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నాగేష్, పల్లె శ్రీనివాస్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మహిపాల్‌రెడ్డి

# వైభవంగా మక్తపల్లి మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట

**కేశంపేట, జులై 5, ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో ఊరబాయి మక్తపల్లి మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగింది.

గత కొన్ని రోజులుగా గ్రామంలో నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణం కొనసాగింది.

అమ్మవారి ప్రాణప్రతిష్ఠతో పీఠ స్థాయికి చేరింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బి ఆర్ ఎస్ యువ నాయకుడు ప్రేమ్ కుమార్ గౌడ్ హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో ప్రేమ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు లభించాలని, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండి పాడిపంటలు భారీగా పండాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సర్పంచ్ నరేష్, దశరథ్, శ్రీనివాస్, రామకృష్ణారెడ్డి, సత్య ప్రకాష్ రెడ్డి, కర్ణాకర్ రెడ్డి, వార్డు సభ్యులు మాధవ్, సురేష్, శ్రీశైలం యాదవ్, ఈటమోని మల్లేష్, మాధవులు, భక్తులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఓటును కాపాడే బాధ్యత బిఎల్‌ఏలదే

**కొడంగల్, జులై 5, ప్రభాతవార్త :** ప్రస్తుతం జరుగుతున్న సర్ కార్యక్రమంలో ప్రతి ఓటును కాపాడుకునే దిశగా బీఆర్ఎస్ బీఎల్ఏలు పూర్తి స్దాయిలో బాధ్యతలు వహించాలని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు.ఆదివారం బొంరాస్‌పేట్ మండల కేంద్రంతో పాటు కొడంగల్ పట్టణంలో ఏర్పాటు చేసిన బీఎల్ఏల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఏ ఒక్క ఓటును కోల్పోయినా ఎన్నికల్లో భారీ నష్టం జరిగే అవకాశం ఉంటుందన్నారు. పట్టణాల్లో ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఓటర్ల వివరాలను పూర్తి స్థాయిలో పరిశీలించి వారికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత బీఎల్ఏలదే అన్నారు. బీఎల్ఓ అధికారులు కాంగ్రెస్ అధికారులు కాదని, కాంగ్రెస్ నాయకులకు బీఎల్ఓలు సమర్ధించినట్లు వ్యవహరించినా జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయాలని గుర్తు చేశారు. బీఎల్ఓలు బీఆర్ఎస్ బీఎల్ఏలకు సమాచారం ఇవ్వకున్నా ఫిర్యాదు అందించాలని, అవిధంగా ఉంటే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు పేర్కొన్నారు. బీఎల్ఏలు ఇంటిని సందర్శించి బీఎల్ఓలు ఓటరు నమోదు పత్రాలను అందించారా లేదా అనేది గుర్తించి వివరాలు సేకరించి బీఎల్ఓల నుంచి సంభందిత ఓటర్ల పత్రాలను తీసుకొని ఓటర్లకు అందించాలని తెలిపారు.ప్రస్తుత ఓటరు సవరణలో జాగ్రత్త పడితేనే ఓటును దక్కించుకునే ఆస్కారం ఉంటుందని, తరువాత బాధపడితే చేసేదేముండదని పేర్కొన్నారు. ఓటరు నమోఉ ప్రక్రియలో బీఎల్ఏలు ఇంటింటిని సందర్శించి బీఆర్ఎస్ సంక్షేమ పథకాలను వివరిస్తు నమోదు చేపట్టే ఆస్కారం ఉన్నట్లు సూచించారు. బీఎల్ఏలు పూర్తి అప్రమత్తత పాటిస్తేనే మన ఓట్లను మనం కాపాడుకునే అస్కారం ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అద్యక్షులు దామోదర్‌రెడ్డి, మాజీ జడ్పీవైస్ చైర్మన్ ముదిగండ్ల క్రిష్ణ, మాజీ కౌన్సిలర్ మధుసుదన్‌యాదవ్,మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, పకీరప్ప తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

## ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం

**తలకొండపల్లి జులై 5,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల కేంద్రంలోశని, ఆదివారం నాడు ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఈవో సుంకిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరానికి అధిక సంఖ్యలో హాజరై కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు కల్వకుర్తి నియోజకవర్గంలో 1150 మంది నిరుపేద కుటుంబాలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి 250 మందికి అద్దాలు అందజేశారు. నియోజకవర్గంలో పదివేల మందికి పైగా అద్దాలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంకిత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి ఎన్నారై సభ్యులు నారాయణరెడ్డి స్థానిక ఎంపీడీవో సీతారామమ్మ, సర్పంచ్‌లు కటికల శేఖర్ యాదవ్, నిర్మల శ్రీశైలం యాదవ్ భారతమ్మ అనిత శ్రీనివాస్, ఉపసర్పంచ్ ఈశ్వర్ విజయ్ కుమార్ రమేష్ యాదవ్ కాంగ్రెస్ మండల నాయకులు డేవిడ్ నరేందర్ గౌడ్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.






























నష్టపరిహారం చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ

## రోడ్డు విస్తరణ బాధితులకు నష్టపరిహారం అందజేత

**చాంద్రాయణగుట్ట, జులై 5, ప్రభాతవార్త :** పాతబస్తీ చాంద్రాయణగుట్ట పోలీసుస్టేషన్ నుండి గాంధీ విగ్రహం మీదుగా పైవంతెన (గుడ్ల దుకాణం) చౌరస్తా వరకు 80 అడుగుల విస్తీర్ణంతో చేపట్టనున్న రోడ్డు విస్తరణలో ఆస్తులు నష్టపోతున్న బాధితులకు ఆదివారం నష్టపరిహారం చెక్కులపంపిణీ జరిగింది. బండ్లగూడలోని బారిస్టర్ ఫాతిమా ఓవైసీ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మొదటి విడతలో 26 మంది బాధితులకు 8కోట్ల 80లక్షల రూపాయల విలువచేసే చెక్కులను ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ అందజేశారు. దీంతో కొన్ని సంవత్సరాల నుండి అపరిష్కృతంగా ఉన్న రోడ్డు విస్తరణ సమస్య ఒక కొలిక్కి వచ్చినట్లయ్యింది. మొత్తం 70 మంది భవన యజమానులు రోడ్డు విస్తరణలో తమ ఇళ్ళను నష్టపోతున్నారు. మిగిలినవారికి రెండవ విడత నష్టపరిహారం అందించనున్నట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అబ్దుల్ వాహబ్, చాంద్రాయణగుట్ట, జంగమ్మెట్, అత్తాపూర్ సర్కిళ్ల టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సుధాకర్, సెక్షన్ ఆఫీసర్ మునావర్ అలీ, భవన యజమానులు పాల్గొన్నారు.

## పోలీసులకు ఉచిత వైద్య పరీక్షలు

**బేగంపేట, జులై 5, ప్రభాతవార్త :** రహదారులపై నిరంతరం శ్రమిస్తూ, ట్రాఫిక్‌ను నియంత్రించే పోలీసుసిబ్బంది ఆరోగ్యం కోసం బేగంపేట ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరం నిర్వహించారు. మల్కాజ్‌గిరి సీపీ బి.సుమతి ఆదేశాల మేరకు, ట్రాఫిక్ డిప్యూటీ కమిషనర్ కె.రాహుల్‌రెడ్డి చొరవతో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. రోడ్లపై ఎక్కువ విధులు నిర్వర్తించే సిబ్బందికి ముందస్తు ఆరోగ్య సమస్యలను గుర్తించి, నివారణ చర్యలు చేపట్టేందుకు వైద్యశిబిరం నిర్వహించినట్లు ట్రాఫిక్ ఏసీపీ శంకరరాజు తెలిపారురు. ట్రాఫిక్ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలంటూ నిరంతరం శారీరక ఓర్పు అవసరమని అందుకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలని ఆయన కోరారు. రెటినోవా ఫౌండేషన్, శ్రీకర హస్పిటల్స్, ప్లానెట్ ఆప్టిక్స్, పద్మసాయి డెంటల్, స్కైఫిట్ ఫిజియో థెరపీల సమన్వయంతో డాక్టర్ భవాని, డాక్టర్ సాయివంశీ, డా. తిలక్, వైద్య బృందం సిబ్బందికి జనరల్ చెకప్‌తోపాటు కంటి, పంటి, ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలు అందించారు. ఈ శిబిరంలో సేవలందించిన వైద్యులకు, సంస్థలకు డీసీపీ రాహుల్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా కవి సమ్మేళనం..కొలకలూరి ఇనాక్‌కు సన్మానం

**సైఫాబాద్, జూన్ 4 ప్రభాతవార్త:** సాహితీమూర్తి పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ 88వ జన్మదినోత్సవం సందర్భంగా ఆదివారం హిమాయత్‌నగర్‌లోని శారద కల్చరల్ హాల్‌లో ఘనంగా సన్మాన సభ, కవి సమ్మేళనం జరిగింది. 88 మంది సాహిత్యకారులు తమ కవితలను కొలకలూరిపై అద్భుతంగా రచించి వినిపించారు. సంగీత-సాహిత్య-సాంస్కృతిక సమన్వయ సంస్థ సాదర ఆహ్వానంలో జరిగిన ఈ కార్యక్రమానికి గనుల శాఖ మాజీ డైరెక్టర్ డా.వి.డి.రాజగోపాల్ అధ్యక్షత వహించారు. ఈ సభలో ముఖ్యఅతిథిగా ద్రావిడ విశ్వవిద్యాలయం పూర్వ ఉప కులపతి కొలకలూరి మధుజ్యోతి పాల్గొనగా, విశిష్ట అతిథులుగా కళారత్న బిక్కి కృష్ణ, విమల సాహితీ సంస్థ అధ్యక్షుడు డా.జల్డి విద్యాధర్ పాల్గొన్నారు. కవి, రచయిత, నటుడు కూకట్లపల్లి పోలయ్య ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరిగింది. సభలో గద్వాల సోమన్నగారి బాలగేయాల 100వ పుస్తకం 'శత మానం భవతి', 'కొలకలూరి వారి కవన వీక్షణ' పుస్తకావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా కొలకలూరి ఇనాక్ ప్రసంగిస్తూ తన జన్మదినోత్సవం సందర్భంగా 88 మంది కవులు తమ అదు భుతమైన కవితలను వినిపించినందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## పేదలకు పుల్లూరు చేసిన సేవలు మరువలేం

**సైఫాబాద్, జులై 5 ప్రభాతవార్త:** ప్రజాస్వామిక, సామాజిక పోరాట యోధులు, తెలంగాణ ఉద్యమకారుడు, జాతీయ లోక్‌దళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పుల్లూరి వెంకటరాజేశ్వర్‌రావు ప్రజలకు చేసిన సేవలు మరువలేమని జాతీయ ప్రజాస్వామిక కూటమి(ఎన్‌డిఎస్‌ఎఫ్) చైర్మన్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి వడ్డమూరి కృష్ణస్వరూప్ కొనియాడారు. ఆదివారం నాడిక్కడ కూటమి కార్యాలయంలో జరిగిన పుల్లూరు సంస్మరణ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత ఆయన చిత్రపటానికి వడ్లమూరి, ఫ్రంట్ నాయకులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కృష్ణస్వరూప్ మాట్లాడుతూ పుల్లూరి ఇచ్చిన రాజకీయ స్పూర్తితో ప్రజాస్వామిక సోషలిస్ట్ సెక్యులర్ రాజ్యస్థాపన కోసం ప్రజలను చైతన్యం పరచడానికి ఫ్రంట్ భాగస్వామ్య సంస్థలు సమయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఫ్రంట్ జాతీయ వర్కింగ్ చైర్మన్ జెట్టి ఎబెల్, దళిత బహుజన పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.మోహన్‌రావు, వంచిత్ బహుజన అగాడి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్, తెలంగాణ జనతా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎం.రాఘవన్, మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవేందర్‌రావు, పుల్లూరి కుటుంబ సభ్యులు సౌభాగ్యమ్మ, శ్రీనివాస్ రావు, పద్మ, మంజుల పుల్లూరు కుమారుడు సంకీర్త పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**బేగంబజార్, జులై 5 ప్రభాతవార్త:** బేగంబజార్ సిబిడిపరిధిలో విద్యుత్ మరమ్మత్తుల కారణంగా సోమవారం 11 కెవి విద్యుత్ ఫీడర్లలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు బేగంబజార్ డివిజనల్ ఇంజనీర్ అన్నయ్య తెలిపారు. 11 కె.వి.ఫైర్‌స్టేషన్ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు గురుద్వారా లైన్, అమృత్‌బార్, లైన్, హన్‌మాన్‌టెంపుల్, పూసలబస్తీ, రామ్‌మందిరం లైన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. 11 కెవి కుత్బీగూడ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాల నుంచి సాయంత్రం 5గంటల 30 నిమిషాల వరకు కుత్బీగూడ, సుప్రభాత్, గణేష్‌టెంపుల్, ఆర్యసమాజ్, చప్పల్‌బజార్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు బేగంబజార్ డివిజనల్ ఇంజనీర్ తెలిపారు.

## అలరించిన కూచిపూడి నృత్య రూపకం

**చిక్కడపల్లి, జులై 5 (ప్రభాతవార్త):** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆదివారం వీక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆదివారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో జ్ఞాన సరస్వతి డ్యాన్స్ అకాడమీ, తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ వైభవం కూచిపూడి నృత్య రూపకాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. గురు వాణి రమణ పర్యవేక్షణలో శిష్య బృందం ఈ నృత్య ప్రదర్శనను అద్భుతంగా గావించింది. తెలంగాణలోని వివిధ జిల్లాల చారిత్రక ప్రాశస్త్యాన్ని, సంస్కృతిని వివరిస్తూ సాగిన ఈ కూచిపూడి నృత్య రూపకం ఆహూతులను మంత్ర ముగ్ధులను చేసింది. విద్యార్థినులు తమ అభినయం, హావభావాలు, లయ బద్ధమైన అడుగులతో తెలంగాణ వైభవాన్ని కళ్లకు కట్టారు. శాస్త్రీయ నృత్య రీతులతో తెలంగాణ అస్తిత్వాన్ని చాటిచెప్పిన తీరు కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే, సృజన స్పందన, అర్థాయన సంస్థల వ్యవస్థాపకురాలు అంజనా చౌదరి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంతటి గొప్ప నృత్య రూపకాన్ని రూపొందించి, భావితరాలకు మన సంస్కృతిని అందిస్తున్న అకాడమీ సెక్రటరీ, గురు శ్రీమతి వాణి రమణను, విద్యార్థులను అభినందించారు. అనంతరం నృత్య ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులను ఘనంగా సత్కరించారు. సాంస్కృతిక సంబరంలో కళాభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




తెలంగాణ వైభవం కూచిపూడి నృత్య రూపకం నిర్వహించిన దృశ్యం

# కాంగ్రెస్ పాలనపై శ్వేతపత్రం విడుదల చేయాలి

### మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాగంటి సునీతాగోపీనాథ్

**జూబ్లీహిల్స్, జులై 5 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాలలోచేసిన అభివృద్ధిపై ప్రజలకు సమాధానం చెప్పకుండా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తుందని మాజీ మంత్రి బిఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్‌యాదవ్ విమర్శించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ప్రత్యేక ఓటర్ సవరణ(ఎస్ఐఆర్) కార్యక్రమంపై జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ మాగంటి సునీతాగోపినాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జూబ్లీహిల్స్ నియోకవర్గం సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతకుముందు తెలంగాణ తల్లి ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేళ్ల పాలనలో రూ.4 లక్షల కోట్ల అప్పులతో సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి లక్షల ఎకరాలకు నీరు అందించడంతో పాటు మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగు నీరు అందించిందన్నారు. యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని అద్భుతంగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రూ.4 లక్షల కోట్లు అప్పులు చేసినప్పటికి ప్రజలకు ఏమిచేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలైన మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం నిరుద్యోగ భృతి తదితర హామీల అమలుపై సమాధానం చెప్పాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన పదవికి తగిన విధంగా వ్యవహరించటం లేదని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలు నెరవేరని హామీలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన తలసాని ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి యువత ఓటరుగా నమోదు అయ్యేలా అవగాహన కల్పించాలని రాజ్యాంగం కల్పించిన విలువైన హక్కు అని అన్నారు. ఈ కార్యక్రమంలో రావుల శ్రీధర్‌రెడ్డి, ప్రదీప్‌చౌదరి, ఆనంద్, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి హాజరుకాకపోవడం విశేషం.



ఏపి మంత్రి దుర్గేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న మధుసూదన్ యాదవ్

## ఎపిలో తెలంగాణ బోనాలకు అన్ని ఏర్పాట్లు చేయాలి

**చార్మినార్, జులై 5 ప్రభాతవార్త :** రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు, ఆయురారోగ్యాలతో అష్టైశ్వరాలు కలిగి సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ గత 16 సంవత్సరాలుగా విజయవాడ శ్రీకనక దుర్గమ్మ తల్లికి బంగారు పాత్రలో బోనం సమర్పిస్తున్నామని భాగ్యనగర్ శ్రీమహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ మల్యాల మధుసూదన్ యాదవ్ తెలిపారు. ఆదివారం ఆయన బేలాలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ జూలై నెల 26వ తేదీన విజయవాడలో తెలంగాణ బోనాల జాతర ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నందున బోనాల ఉత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కోరుతూ ఏపి పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి విజయవాడలో వినతిపత్రం అందజేశామని తెలిపారు. 26న విజయవాడలోని బ్రాహ్మణ వీధి నుంచి శ్రీకనకదుర్గమ్మ దేవాలయం వరకు బాజాబజంత్రీలతో బంగారు బోనం సామూహిక ఊరేగింపు కార్యక్రమాన్ని కనులపండగగా నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. ఈ విషయమై మంత్రి సానుకూలంగా స్పందించి విజయవాడలో బోనాల జాతర ఉత్సవాల ఏర్పాట్లకు సంబంధింత అధికారులకు ఆదేశాలు జారీ చేశారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఊరేగింపు కమిటి మాజీ చైర్మన్లు గాజుల అంజయ్య, జనగామ మధుసూదన్‌గౌడ్, ప్రతినిధులు నోముల ప్రకాష్‌గౌడ్, కోటిరెడ్డి పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లిలో టిఆర్ఎస్‌జెండా ఎగురవేస్తాం

### వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్

**శేరిలింగంపల్లి, జులై 5 ప్రభాతవార్త :** శేరిలింగంపల్లి నియోజక వర్గంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండాను ఎగురవేస్తామని టీఆర్ఎస్ నియోజక వర్గ నేత వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ అన్నారు. శేరిలింగంపల్లిలో తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన టీఆర్ఎస్ జెండా పండుగలో భాగంగా శేరిలింగంపల్లిలోని రైతుబజార్ దగ్గర వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో శేరిలింగంపల్లి నియోజకవర్గ ఉద్యమకారులది కీలకమైన పాత్రయని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర అస్తిత్వ పోరాటానికి నడుంకట్టిన టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత నేతృత్వంలోనే తెలంగాణ రాష్ట్రం ప్రగతిపథంలో నడుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజక వర్గంలోని అన్ని డివిజన్లలో టీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తున్నామని, రాబోయే ఎన్నికలల్లో శేరిలింగంపల్లి నియోజక వర్గంలో టీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తామన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, వాసిలి నివేదిత, సురేశ్, కిశోర్, లావణ్యబండారి, విష్ణుచారి, కవిత, మాదవి, కుమార్‌యాదవ్, సందీప్, షేక్ అస్లం, ప్రవీణ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్



డాక్టర్ శ్యామల మాధురి కుమార్‌లను సత్కరిస్తున్న రాందాస్ తేజావత్

## వీణా వాదనం భారత సంస్కృతికి ప్రతీకలు

### నగర ట్రాఫిక్ అదనపు డీసీపీ రాందాస్ తేజావత్

**చిక్కడపల్లి, జులై 5(ప్రభాతవార్త) :** భారతీయ శాస్త్రీయ సంగీతం, వీణా వాదనం భారత సంస్కృతికి ప్రతీకలని నగర ట్రాఫిక్ అదనపు డీసీపీ రాందాస్ తేజావత్ పేర్కొన్నారు. ఆదివారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో గుండవరపు హనుమంతరావు కళావేదికలో వీణాగాన శిరి స్వరమాధురి ఫైన్ ఆర్ట్స్ నిర్వాహకులు డాక్టర్ శ్యామల మాధురి కుమార్ ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామల మాధురికుమార్, నాగశిరీష నిర్వహించిన సంగీత జ్ఞానమే భక్తి వీణ కార్యక్రమం సంగీతాభిమానులను అలరించింది. ముఖ్యఅతిథిగా హాజరైన రాందాస్ తేజావత్ అద్భుతంగా వీణావాద్య కార్యక్రమాన్ని నిర్వహించిన ప్రముఖ వీణావిద్వాసురాలు డాక్టర్ శ్యామల మాధురికుమార్‌లను సత్కరించి అభినందించారు. డాక్టర్ శ్యామల మాధురి కుమార్ మాట్లాడుతూ కర్ణాటక సంగీతం, వీణ ప్రాముఖ్యతను భావితరాలకుచేరవేసి, ఈగొప్ప సంప్రదాయం అంతరించిపోకుండా కాపాడాలనే లక్ష్యంతో ప్రత్యేక అవగాహన కోసం సంస్థను ఏర్పాటు చేసినట్లు వివరించారు. సంగీత త్రిమూర్తులు, ప్రముఖ వాగ్గేయకారులు, ఎం.ఎస్.సుబ్బలక్ష్మి, వీణా విద్వాంసుడు చిట్టిబాబు, మ్యాండలిన్ శ్రీనివాస్ వంటి మహనీయుల సంగీతాన్ని భావితరాలు అందించాలని సంకల్పించించినట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు టి.రామోజీ పాల్గొన్నారు.

## కుటుంబ విలువలకు అద్దంపట్టిన తరంగి నవల

### పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**చిక్కడపల్లి, జులై 5(ప్రభాతవార్త):** భారతీయ సంస్కృతికి మూలాధారమైన కుటుంబ వ్యవస్థను ప్రతిబింబించే అద్భుతమైన కథగా తరంగి నవల అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అభివర్ణించారు. ఆదివారం రచయిత డాక్టర్ వై. రామకృష్ణా రావు కల్పిత కథనం ద్వారా భారతీయ సాంస్కృతిక వారసత్వంలోని ఉన్నత విలువలను రాబోయే తరాలకు అందించే విశిష్ట ప్రయత్నం చేశారని ఆయన ప్రశంసించారు. ప్రముఖ రచయిత డాక్టర్ వై. రామకృష్ణా రావు మర్యాదపూర్వకంగా వెంకయ్య నాయుడును కలిసి తన తాజా రచన "తరంగి" నవలను ఆయనకు బహూకరించారు. నవలను పరిశీలించిన వెంకయ్య నాయుడు మాట్లాడుతూ, భారతీయ కుటుంబ వ్యవస్థ, సంస్కృతి, సంప్రదాయాలు, మానవీయ విలువలను ప్రతిబింబించే సాహిత్యం సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. యువతలో కుటుంబ బంధాలు, సామాజిక బాధ్యత, సంస్కృతి పట్ల గౌరవాన్ని పెంపొందించే విధంగా రచయిత ఈ నవలను తీర్చిదిద్దారని కొనియాడారు. డాక్టర్ వై. రామకృష్ణా రావును అభినందిస్తూ, తెలుగు సాహిత్యానికి ఆయన మరిన్ని విలువైన రచనలు అందించాలని వెంకయ్య నాయుడు ఆకాంక్షి ంచారు.



రచయిత డాక్టర్ వై.రామకృష్ణా రావు రచించిన తరంగి నవలను ఆవిష్కరిస్తున్న పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు



మాట్లాడుతున్న యెర్రా కామేష్

## యూట్యూబర్ రావణ్‌పై 'ఉపా' చట్టం ఎత్తివేయాలి

**సైఫాబాద్, జులై 5 ప్రభాతవార్త:** ఎపి ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్‌ను ప్రశ్నించినందుకు యూట్యూబర్ ప్రశ్న రావణ్‌పై 4 సార్లు దాడి చేసిన కూటమి ప్రభుత్వం ఉపా చట్టం నమోదు చేసి పైశాచిక ఆనందం పొందుతున్నదని జైభీమ్‌రావు భారత్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు, న్యాయవాది యెర్రా కామేష్ ఆరోపించారు. ప్రశ్న రావణ్‌ను ఒక కేసులో అరెస్టు చేసి రిమాండ్ చేయగా కోర్టు బెయిల్ మంజూరు చేసిన వెంటనే మరొక కేసులో అరెస్టు చేస్తున్నారని, ప్రశ్న రావణ్‌పై ఇప్పటికి జనసేన పార్టీ ఉన్న ఎమ్మెల్యేలు నాలుగు రోజుల్లో నాలుగు పోలీస్‌స్టేషన్‌లో అరెస్టు చేసి నాలుగు కోర్టుల్లో హాజరుపరచగా బెయిల్ మంజూరు చేయ డం జరిగిందన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రశ్న రావణ్ తరపున జైభీమ్‌రావ్ భారత్ పార్టీ జాతీయ అధ్యక్షుడు, హైకోర్టు న్యాయ వాది జడ శ్రావణ్‌కుమార్ నాలుగురోజులపాటు నలుగురు న్యాయమూర్తుల వాదనలు వినిపించడంతో శనివారం బెయిల్ మంజూరైందని గుర్తుచేశారు. ప్రశ్న రావణ్‌పైన ఎన్ని కేసులు పెట్టినా జడ శ్రావణ్‌కుమార్ బెయిల్ తీసుకువసారనే దురుద్దేశంతో రావణ్‌పై ఉప చట్టం నమోదు చేశారని ఆయన ఆరోపించారు. వందలాదిమంది జనసేన నాయకులు, కార్యకర్తలు ప్రశ్న రావణ్‌పై దాడిచేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇది అప్రజాస్వామికమన్నారు. ప్రశ్న రావణ్‌కు ఎలాంటి హానీజరిగినా కూటమి ప్రభుత్వం నైతికబాధ్యత వహించవలసి ఉంటుందని ఆయన హెచ్చరించారు. సమావేశంలో నాయకులు గంధం మల్లికార్జునరావు, రవికుమార్, తుమ్మ వంశీ, గజ్జల శంకర్ పాల్గొన్నారు.

### విరసం సభకు అనుమతి ఇవ్వకపోవడం

## భావ ప్రకటన స్వేచ్ఛను హరించడమే

**సైఫాబాద్, జులై 5 ప్రభాతవార్త:** విప్లవం రచయితల సంఘం(విరసం) ఆవిర్భావ సభకు బాగ్‌లింగపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనీయకుండా అడ్డుకోవడం పూర్తిగా భావ ప్రకటన స్వేచ్ఛను హరించడమేనని పలువురు వక్తలు ఆరోపించారు. దీని వెనుక ప్రభుత్వ నిరంకుశ విధానాలు అద్దంపడుతున్నాయని, కేంద్ర ప్రభుత్వ మెప్పుకోసం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తహ, తహ లాడుతున్నదని ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడయా సమావేశంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. ప్రొఫెసర్ జి.హరగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇలాంటి అప్రజాస్వామిక చర్యలకు పాల్పడరాదని హెచ్చరించారు. విరసం అధ్యక్షుడు విరసవల్లి కృష్ణ మాట్లాడుతూ విప్లవోద్యమాలు, ప్రజా ఉద్యమాలను అణిచివేయడమే కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. రాజ్యాంగాన్ని నిలువున పాతర వేస్తున్నారని విరసం కార్యదర్శి రివేరా ఆరోపించారు. వీక్షణం సంపాదకులు ఎన్.వేణు మాట్లాడుతూ విరసం సభను జరగనీయలేదంటే ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఏమాత్రం గౌరవిస్తుందో అర్థమవుతుందన్నారు.

## పురుషోత్తంకు ఘన నివాళులు

**బేగంబజార్, జులై 5 ప్రభాతవార్త:** దళిత బడుగు బలహీన వర్గాల నాయకుడిగా దివంగత మాజీ చుడీబజార్ ఆరుంధతీ సేవా మండలి అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వి.జి.పురుషోత్తం చేసిన సేవలు మరువలేనివని దళిత నాయకులు సంఘ సేవకులు ఎంపి భీష్మా అన్నారు. వి.జి పురుషోత్తం ప్రథమ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్ని పురుషోత్తం చిత్రపటానికి పూలమాలవేసి నివాళుర్పించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు వి.జి రాజేందర్, తిరుమలేష్, బిఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మహాకవి దాశరథి సాహితీ చైతన్యం గ్రంథం ఆవిష్కరణ



గ్రంథావిష్కరణ కావిస్తున్న రమణాచారి, ఫణీంద్ర, మనోహర్‌బాబు

**నాంపల్లి, జులై 5 ప్రభాతవార్త :** నేడు తెలంగాణ రాష్ట్రం సాకారమై స్వేచ్ఛావాయువులు పీలుస్తున్నామంటే అందులో కీలకపాత్ర దాశరథి, ఆయన అద్భుత రచనల చలువేనని స్పష్టం చేసిన తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి దాశరథి ఉద్యమ పోరాటాలు, రచనలను ఉటంకించారు. యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ, కళా కౌముది సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు వెలుగు సమాఖ్య కార్యక్రమాల పరంపరలో 22వ సమావేశం శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయంలోని డా. రావిచెట్టు రంగారావు సభావేదికలో ఆదివారం రాత్రి సంస్థ అధ్యక్షుడు డా. ఆచార్య ఫణీంద్ర సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర పూర్వ సలహాదారు, భాషానిలయం అధ్యక్షుడు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి ఆత్మీయ అతిథులు ఆచార్య వంగపల్లి విశ్వనాథం, గిరిజా మనోహర్‌బాబు, డా. బి.జయరాములు, ఆచార్య మామిడాల రమేష్‌బాబు, డా. బండికాడి నాగిరెడ్డి, జీడిగుండ వెంకట్రావు, ఆచార్య పగడాల చంద్రశేఖర్ తదితరులతో కలిసి మహాకవి దాశరథి సాహితీ చైతన్యం గ్రంథాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆచార్య మామిడాల రమేష్‌బాబు విశ్వనాథ వారి పురాణ వైర గ్రంథమాల పరిచయం; డా. బండికాడి నాగిరెడ్డి తెలుగు పద్యనాటకాల ఆరంభ వికాసాలు-పరిచయం లపై సాహిత్య ప్రసంగాలు చేయగా డా. బి.జయరాములు గ్రంథ పరిచయం కావించారు.

## విఖ్యాత కథకుడు డాక్టర్ రావూరి భరద్వాజ

**చిక్కడపల్లి, జులై 5 (ప్రభాతవార్త) :** పెద్ద చదువులు చదవని రావూరి భరద్వాజ సామాన్య స్థాయినుంచి తన సాహితీ సృజనతో అత్యుత్తమ సాహిత్య పురస్కారం జ్ఞానపీఠం అందుకున్న మహోన్నతుడు అని దూరదర్శన్ పూర్వసంచాలకుడు డాక్టర్ పి.మధుసూదన్‌రావు చెప్పారు. శ్రీత్యాగరాయ గానసభలోని కళాలలిత కళావేదిక పై జీవిఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ నిర్వహణలో విఖ్యాత కథకుడు డాక్టర్ రావూరి భరద్వాజ జయంతి సందర్భంగా ఆయన పేరిట సాహితీ పురస్కారం రచయిత పరవస్తు లోకేశ్వర్‌కి రావూరి కాంతమ్మ స్మారక సేవ పురస్కారం గాయని హారి ప్రియకు బహుకరణ సభ జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ మధుసూదన రావు లోకేశ్వర్‌కు పదివేల రూపాయల నగదు హారి ప్రియకు ఐదు వేల రూపాయల నగదు తో ఇరువురిని జ్ఞాపిక ప్రశంసా పత్రం తో సత్కరించి మాట్లాడారు భరద్వాజ ప్రతి రచనా వాస్తవాలు కు అద్దం అని ముఖ్యం గా ఆయన సినీ నటి జీవితం గురించి రాసిన పాకుడు రాళ్ళు నాడు సంచలనం సృష్టించిన సంగతి గుర్తు చేశారు అధ్యక్షత వహించిన నేటి నిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసు మాట్లాడుతూ పురస్కార గ్రహీత లోకేశ్వర్ యాత్రా సాహిత్యం రచయిత గా పేరు ప్రఖ్యాతులు పొందారు అని అభినందించారు హారి ప్రియ శాస్త్రీయ సంగీతం లో ఖ్యాతి పొందారనీ కొని యాడారు వేదిక పై రచయిత్రి రాజ్యశ్రీ సాహితీ కిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావులు రావూరి భరద్వాజ రచనల్లో ప్రత్యే కతల గురించి వివరించారు కవి పెద్దూరి వెంకట దాసు సభా నిర్వహణ చేయగా రావూరి భరద్వాజ కుమారుడు కోటేశ్వరరావు నివేదిక సమర్పిం చారు. సంస్థ కార్యదర్శి రాఘవరెడ్డి స్వాగతం పలికారు. తొలుత కూచిపూడి నృత్యాలయ సంస్థ కోమల శిష్య బృందం కూచిపూడి నృత్య అంశాలు ప్రదర్శించారు




పరవస్తు లోకేశ్వర్‌కి రావూరి కాంతమ్మ స్మారక సేవ పురస్కారం గాయని హారి ప్రియకు బహుకరిస్తున్న దృశ్యం

# బిఆర్ఎస్ పాలనలో ఆశించిన అభివృద్ధి జరగలేదు

### టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్




మాట్లాడుతున్న బండి రమేష్

**కెపిహెచ్‌బి కాలనీ, జులై 5, ప్రభాతవార్త**

బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగలేదనీ టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్ ధ్వజమెత్తారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో జరుగుతున్న సర్ ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం సందర్భంగా బండి రమేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, బిఎల్ఎలు, డివిజన్ అధ్యక్షులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతు కాంగ్రెస్ పార్టీ తరఫున నియమించిన ప్రతి బూత్‌లెవెల్ ఏజెంట్(బిఎల్ఎ) బూత్ పరిధిలో బూత్ లెవెల్ ఆఫీసర్(బిఎల్ఓ)తో సమన్వయం చేసుకుని విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు సర్ కార్యక్రమంపై విస్తృత అవగాహన కల్పిస్తు ఎన్యుమరేషన్ ఫారాలు నింపించడం, ఓటరు వివరాల్లో సవరణలు, చిరునామా మార్పులు, కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన వారి పేర్ల తొలగింపు, డబుల్ ఓటర్ల గుర్తింపువంటి అంశాల్లో బిఎల్ఓలకు సహకరించాలని కోరారు. బిఎల్ఎలు ప్రతిరోజూ తప్పనిసరిగా బిఎల్ఓతో కలిసి క్షేత్రస్థాయిలో పని చేయాలని, ఎవరైనా విధులకు హాజరుకాలేని పరిస్థితి ఉంటే పార్టీ తరఫున వెంటనే మరో వ్యక్తిని బిఎల్ఎగా నియమిస్తామని తెలిపారు. తాను ప్రతి రోజు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కార్యక్రమం అమలును పరిశీలిస్తానని చెప్పారు. ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మరింత చురుకుగా వ్యవహరించాలని సూచించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగలేదని హ్యాట్రిక్ ఎమ్మెల్యేనని చెప్పుకునే కూకట్‌పల్లి నియోజకవర్గం ప్రస్తుత బిఆర్ఎస్ ఎమ్మెల్యే హయాంలో చెరువులు, ప్రభుత్వ భూముల కబ్జాలు పెరిగాయని, గత బిఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో నియోజకవర్గంలో కేవలం 242 ఇళ్లే నిర్మించారని అభివృద్ధిలో ఎమ్మెల్యే కృష్ణారావు విఫలమయ్యారని అన్నారు. కాంగ్రెస్ పార్టీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయడం ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలకు పార్టీ పరంగా గానీ, ప్రభుత్వ అధికారుల సహకారం విషయంలో గానీ ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇటీవల టిపిసిసి నియమించిన నూతన డివిజన్ అధ్యక్షులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న అర్హులైన ఉద్యమకారులను గుర్తించి వారి వివరాలను ప్రభుత్వానికి పంపించాలని పార్టీ ఆదేశించిన నేపథ్యంలో, నిజమైన అర్హులైన తెలంగాణ ఉద్యమకారులు తమ వివరాలను పార్టీ కార్యాలయంలో అందజేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ నియమించిన కూకట్‌పల్లి నియోజకవర్గ సర్ అబ్జర్వర్ వినయ్, ఏ బి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగిరెడ్డి, తూము వేణు, ఏఎంసి చైర్మన్ పుష్ప రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి, అన్ని డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు, యూత్‌కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ, బిఎల్ఎలు, కాంగ్రెస్ పార్టీ అన్ని విభాగాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.